బుధవారం
29-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 275
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

### మంత్రి రజినీకి హైకోర్టు నోటీసు

గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో గ్రానైట్ తవ్వకాలపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మంత్రి విడదల రజనీ, ఎంపీ అవినాశ్‌రెడ్డి బంధువులు ప్రతాప్ రెడ్డి, స్వేతారెడ్డి, జీవీ దినేశ్‌రెడ్డి, శివపార్వతికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

2లో

## జగన్ సర్కార్ దూకుడుకు బ్రేక్

- హైకోర్టు తీర్పుపై స్టేకు సుప్రీం నిరాకరణ
- అమరావతి కేసు విచారణ మరింత జాప్యం
- జులై 11కి విచారణ వాయిదా

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
అమరావతి రాజధానిపై సుప్రీంకోర్టులో ఉన్న కేసును త్వరగా ముగించుకుని పరిపాలనా రాజధానిని విశాఖపట్నం మార్చుకోవాలని తొందరపడుతున్న జగన్ సర్కార్‌కి అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాలతో ఎప్పటికప్పుడు బ్రేక్‌లు పడుతున్నాయి. ఉగాది నాటికి విశాఖ తరలివెళ్లాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని కేసును త్వరగా విచారణ చేపట్టాలని సుప్రీంను కోరింది. అయినప్పటికీ సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వస్తుండగా, మంగళవారం నాటి విచారణతో తేలిపోతుందని ప్రభుత్వపెద్దలు ఆశించినప్పటికీ మళ్లీ వాయిదా పడింది. ఈసారి ఏకంగా జులై 11కి విచారణ వాయిదా పడింది. దీంతో రాష్ట్ర రాజధానిపై కొన్నిరోజులుగా నెలకొన్న ఉత్కంఠకు ఇప్పట్లో తెరపడే అవకాశాలు కనిపించట్లేదు. ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు పోరాటం చేస్తుండగా...హైకోర్టు తీర్పుపై స్టే విధించాలంటూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు పిటిషన్లపై న్యాయమూర్తి కేఎం జోసెఫ్, బీవీ నాగరత్నలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం సుదీర్ఘంగా విచారించింది. పిటిషన్లపై త్వరగా విచారణ జరపాలని ఏపీ ప్రభుత్వం కోరగా...న్యాయస్థానం తోసిపుచ్చింది. విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని పదేపదే కోరినప్పటికీ అందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అమరావతి రైతుల పిటిషన్‌తో పాటు ప్రభుత్వ పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ...ప్రభుత్వం తరఫు పిటిషన్‌ను జులై 11న తొలి కేసుగా విచారణకు తీసుకుంటామని ధర్మాసనం చెప్పింది. మూడు రాజధానుల చట్టాన్ని ఉపసంహరించుకున్న తరువాత హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అర్థం లేదంటూ తొలుత రైతుల తరఫున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ లాయర్లు చేసిన విజ్ఞప్తులను జస్టిస్ కేఎం జోసెఫ్ పట్టించుకోలేదు. జూన్ 16న జస్టిస్ కేఎం జోసెఫ్ పదవీ విరమణ చేయనున్నారు. అందుకే కేసు విచారణను జులై 11కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. జులై 11న వేరే ధర్మాసనం ముందు అమరావతి కేసు విచారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తను రిటైర్ అవుతున్నందున

- మిగతా 2 లో

## పోలవరం సమస్యలపై
# ఢిల్లీకి అఖిలపక్షం

విజయవాడలో...

గుంటూరులో...

- తీసుకెళ్లే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- ప్రాజెక్టును చిత్తశుద్ధితో పూర్తి చేయాలి
- లేకుంటే చరిత్రహీనులవుతారు
- సీపీఐ రెండో రోజు దీక్షల్లో నారాయణ, రామకృష్ణ హెచ్చరిక
- ఆందోళనకు విపక్షాల సంఘీభావం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
నరేంద్రమోదీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై లోక్‌సభలో ఒక విధంగా, రాజ్యసభలో మరోవిధంగా సమాధానం చెపుతూ రాష్ట్ర ప్రజల్ని దగా చేస్తున్నదని అఖిలపక్ష నేతలు మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు 41.5 మీటర్లకు కుదిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జాతీయ ప్రాజెక్టుగా పూర్తిస్థాయిలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన దీక్షలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ఈ దీక్షలను గుంటూరులో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించగా, టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన పార్టీ నేతలు దీక్షా శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలియజేశారు. గుంటూరులో నారాయణ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అనేక ఆటంకాలు ఎదురైనప్పటికీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం కేంద్రానికి ఊడిగం చేస్తూ ప్రజలను మోసం చేస్తూ తండ్రి ఆశయాలకు పంగనామాలు పెడుతున్నారని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే ప్రాజెక్టు కాస్తా బ్యారేజ్ అవుతుందని, అలా చేయాలని చూస్తే ఈ ప్రభుత్వాలకు ప్రజలే పంగనామాలు పెడతారని హెచ్చరించారు. ఒకే తరహా రాజకీయం చేస్తున్న బీజేపీ, వైసీపీలు పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎందుకు కలిసి పనిచేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై అఖిలపక్షం అధ్వర్యంలో కేంద్రంపై ఒత్తిడి చేయమంటే... ఒక్కడే మోదీ వద్దకు వెళ్లి కాళ్లు మొక్కి రావడం జగన్ పనిగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పోలవరం ఎత్తు తగ్గించకుండా నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే అంశాలపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. తన తండ్రి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును తాను పూర్తి చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం జగన్...మాట నిలబెట్టుకోవాలన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే చరిత్రహీనుడిగా జగన్ మిగులుతారని హెచ్చరించారు. పోలవరానికి నిధులు రాబట్టి ప్రాజెక్టు పూర్తి చేయటం ముఖ్యమంత్రి ఒక్కడివల్ల అయ్యే పనికాదని, అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని సీఎం జగన్‌కు సూచించారు. రైతుసంఘాల నాయకులతో చర్చించి పోలవరం పూర్తిస్థాయి నిర్మాణం చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీస్థాయిలోనూ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

బాపట్లలో

**గేటు కూడా పెట్టని వారు ప్రాజెక్టు నిర్మిస్తారా: దేవినేని ఉమ**
మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా పోలవరం కోసం ఐదేళ్లలో

- మిగతా 2 లో

### పులివెందులలో
## కాల్పుల కలకలం

- ఒకరి మృతి...మరొకరి పరిస్థితి విషమం
- నిందితుడు భరత్‌యాదవ్ లొంగుబాటు

**విశాలాంధ్ర-పులివెందుల:**
వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో మంగళవారం తుపాకీ తూటా పేలింది. ఇద్దరిపై కాల్పులు జరిగాయి. అందులో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు...పులివెందుల పట్టణానికి చెందిన భరత్‌యాదవ్, రాగిపాటి మస్తాన్, చింతకుంట దిలీప్‌కుమార్ మధ్య ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవహారాల్లో విభేదాలు కాల్పులకు దారితీసింది. భరత్‌యాదవ్, దిలీప్, మస్తాన్ మధ్యాహ్నం వేళ స్థానిక

- మిగతా 2 లో

## అంతా హడావుడే...

- జీ20 సదస్సుకు తొలి రోజు నామమాత్రంగా ప్రతినిధులు
- డీలా పడిన అధికారులు... ప్రజాప్రతినిధులు
- సాగర తీరంలో మెరుపులతో ప్రజాధనం వృథా

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం :**
అంతన్నారు... ఇంతన్నారు... విశాఖ అభివృద్ధి మేడిపండు చందంగా అహో ఓహో అంటూ జీ20 సదస్సు పేరిట రూ.150 కోట్లు ఖర్చు చేసి రెండు నెలలుగా ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సదస్సుకు 200 మంది అతిథులు వస్తారని హంగులు, రంగులతో సాగర తీరాన్ని, వారొచ్చే మార్గాన్ని మాత్రమే అభివృద్ధి చేశారు. అయితే తొలిరోజు ప్రతినిధుల హాజరు నామమాత్రంగా ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులకు తీవ్ర నిరాశ ఎదురయింది. 63 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని, సోమవారం సాయంత్రానికే 57 మంది విశాఖ చేరుకున్నారని నిర్వాహకులు

- మిగతా 2 లో

### మే 28,29 తేదీల్లో రాజమహేంద్రవరంలో
## టీడీపీ మహానాడు

- ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా 100 సభలు నిర్వహణ
- వచ్చే ఎన్నికల్లో 40 శాతం యువతకే టికెట్లు
- టీడీపీ పొలిట్‌బ్యూరో నిర్ణయం

2లో

## ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.15 శాతం

- సీబీటీ సమావేశంలో నిర్ణయం
- పెంపు నామమాత్రం

**న్యూఢిల్లీ:**
ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల్లో నిల్వలపై వడ్డీరేటు ఖరారైంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను 8.15 శాతం వడ్డీరేటును నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రానికి ఈపీఎఫ్ఓ ప్రతిపాదనలు చేసింది. ఇది స్వల్ప పెరుగుదల మాత్రమే. దీనివల్ల ఆరు కోట్లమంది ఖాతాదారులకు నామమాత్రపు ప్రయోజనం చేకూరుతుంది. గత ఆర్థిక సంవత్సరం (8.10శాతం)తో పోలిస్తే ఇది కొంచెం అధికం. సోమ, మంగళవారాల్లో జరిగిన ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ వడ్డీ రేటును 8.15 శాతం ఇవ్వాలని నిర్ణయించారు. సీబీటీ నిర్ణయాన్ని కేంద్ర ఆర్థికశాఖకు పంపనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తర్వాత వడ్డీరేటును ఈపీఎఫ్ఓ అధికారికంగా నోటిఫై చేస్తుంది. ఆ తర్వాత వడ్డీ మొత్తాన్ని ఈపీఎఫ్ఓ ఐదు కోట్ల చందాదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. సీబీటీ ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థికశాఖ త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్‌పై వడ్డీరేటు 8.5 శాతంగా ఉండేది. కానీ ఎన్నడూ లేనివిధంగా గత ఆర్థిక సంవత్సరానికి (2021-22) సంబంధించిన వడ్డీ రేటును 8.1 శాతంగా నిర్ణయించారు. గత నాలుగు దశాబ్దాల్లో పీఎఫ్‌పై ఇదే తక్కువ వడ్డీ రేటు కావటం గమనార్హం.
గడచిన పదేళ్లలో ఈపీఎఫ్ వడ్డీ రేట్లు పరిశీలిస్తే...2011-12లో 8.25 శాతం

- మిగతా 2 లో

### ఈపీఎఫ్ఓలో ఓబీసీలకు స్థానమేది?
కేంద్రాన్ని నిలదీసిన పార్లమెంటరీ కమిటీ

2లో

## కాంగ్రెస్ మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు

- ఎర్రకోట వద్ద ఉద్రిక్తత
- రావత్ సహా అనేకమంది అరెస్టు

**న్యూఢిల్లీ:**
కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై లోక్‌సభ ఎంపీగా అనర్హత వేటు పడటానికి వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు ఆందోళనను తీవ్రతరం చేశారు. మంగళవారం దేశంలోని 35 ప్రధాన నగరాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించడమే కాకుండా న్యూఢిల్లీలో 'లోకతంత్ర బచావో మషాల్ శాంతి మార్చ్'ను కాంగ్రెస్ చేపట్టింది. అయితే వేదికకు చేరుకోకుండా పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఎర్రకోట వద్దకు వెళ్లకుండా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కనీసం ఎర్రకోట పరిసరాల్లోకి అనుమతివ్వడంలేదని ఓ కార్యకర్త తెలిపారు. సత్యమన్నా, సత్యాగ్రహమన్నా నియంతకు చాలా భయం.. అందుకే ఎర్రకోట వద్ద శాంతియుతంగా చేపట్టే కాగడా ర్యాలీని నిలువరించేందుకు పోలీసులు భారీస్థాయిలో మోహరించారని కాంగ్రెస్ ట్విట్టర్‌లో

- మిగతా 2 లో

### ఇదీ లోకం!

తలసరి అప్పు ఇంకా పెరిగేలా మంచి పథకాలు చెబుతాం.

# న్యాయ సంస్కరణలకు బ్రేక్

- నెతన్యాహు 'టైమౌట్' ప్రకటన
- సంయమనం పాటించాలని నిరసనకారులకు పిలుపు
- ఇజ్రాయిల్‌లో మిన్నంటిన ప్రజాందోళన
- 24 గంటల్లో 34 మంది అరెస్టు

**టెల్‌అవీవ్:** ఇజ్రాయిల్‌లో వివాదాస్పద న్యాయ సంస్కరణలపై దేశ ప్రజలు ఆందోళనకు దిగారు. 12 వారాలుగా వీటిని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. తాజా పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీశాయి. దీంతో నెతన్యాహు ప్రభుత్వం మెట్టుదిగింది. న్యాయవ్యవస్థలోని సంస్కరణలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. సార్వత్రిక సమ్మెతో సోమవారం దేశం స్తంభించిన దృష్ట్యా ఆయన ఈ మేరకు ప్రకటించారు. 'మన దేశాన్ని చీల్చేయాలని చూసే అతివాదులు ఉన్నారు. యుద్ధానికి దారితీయాలని, సాయుధ సేవలను నిరాకరించాలని చూస్తున్నారు. ఇది ఘోరమైన నేరమని తెలుసుకోండి' అని ప్రధాని అన్నారు. మూడువేల ఏళ్ల కిందటి రాజు షోలోమో కథ నుంచి చాలా నేర్చుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో ఇజ్రాయిల్‌ను చీలిపోనివ్వనని నెతన్యాహు ఉద్ఘాటించారు. చర్చల ద్వారా యుద్ధాన్ని నివారించేందుకు అవకాశమున్నప్పుడు అందుకు యత్నిస్తానని చెప్పారు. ఈలోగా దేశ ప్రజలు సంయమనం పాటించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హింసకు పాల్పడరాదని సూచించారు. దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే పరిస్థితులు నెలకొన్న క్రమంలో న్యాయ సంస్కరణలను తక్షణమే నిలిపివేయాలని అధ్యక్షుడు ఐజక్ హెర్‌జాగ్ చేసిన సూచన మేరకు నెతన్యాహు తాజా ప్రకటన చేశారు.మరోవైపు నిరసనలు మిన్నంటిన క్రమంలో పోలీసులు 24 గంటల్లో 34 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసు అధికారులు స్టన్‌గ్రెనేడ్లను ప్రయోగించారు. వివాదాస్పద న్యాయసంస్కరణలకు వ్యతిరేకంగా 12 వారాల నుంచి ఇజ్రాయిల్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించి ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలతో నిరసనకారులు హోరెత్తించారు. దీంతో పోలీసులతో పాటు సైన్యం కూడా రంగంలోకి దిగి ఆందోళనపై ఉక్కుపాదం మోపింది. బాష్పవాయువు గోళాలు, స్టన్‌గ్రెనేడ్లను ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. ఇదే క్రమంలో అనేకమంది నిరసనకారులను అరెస్టు చేశారు. ఇటీవల ఇజ్రాయిల్ ప్రభుత్వానికి, న్యాయమూర్తులకు మధ్య విభేదాలు తలెత్తడంతో ఓ అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాని తనకు జైలుశిక్ష పడకుండా తనను తాను కాపాడుకునేందుకు ప్రయత్నం చేశారు. న్యాయవవస్థలో సంస్కరణల నెపంతో మార్పులు చేర్పులు చేశారు. ఇందులో జడ్జీల నియామకం, ప్రభుత్వం జారీ చేసిన చట్టాలను రద్దు చేసే అధికారాన్ని కోర్టులకు లేకుండా చేయడం వంటి వివాదాస్పద సంస్కరణలు ఉండటంతో ఇజ్రాయిల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తన సంస్కరణలపై అభ్యంతరం వ్యక్తంచేసిన రక్షణమంత్రిపై వేటును నెతన్యాహు వేశారు. దీంతో మంత్రికి మద్దతుగా, న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రజలు ఆందోళన బాట పట్టారు. రోడ్లపైకి వచ్చి నిరసన గళాన్ని వినిపించారు. ఇప్పుడు ప్రజాందోళన తీవ్రరూపం దాల్చింది. అతిపెద్ద కార్మిక సంస్థ సమ్మెకు దిగడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు.

# కార్మికోద్యమం మరింత బలోపేతం కావాలి

## కమ్యూనిస్టు-వర్కర్స్ పార్టీల సంయుక్త ప్రకటన పిలుపు

బూర్జువ వ్యతిరేకోద్యమాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం కార్మికులు నడుంబిగించాలని కమ్యూనిస్టు-వర్కర్ల పార్టీల సంయుక్త ప్రకటన సూచించింది. సోషలిజం పునరుద్ధరణ- సామ్యవాద యుద్ధానికి వ్యతిరేక పోరు తీవ్రరూపం దాల్చిన అవసరాన్ని నొక్కిచెప్పింది. ఉక్రెయిన్‌పై ఏడాదిపైగా యుద్ధం జరుగుతూనే ఉందంటూ ఆవేదన వ్యక్తంచేసింది. సోవియట్ యూనియన్ పతనం, సోషలిజం పరాజయం క్రమంలో ప్రజలు ఇలాంటి విపత్తుకర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తోందని ప్రకటన పేర్కొంది. యూఎస్ఎస్ఆర్ ఉన్నప్పుడు సోవియల్ రిపబ్లిక్‌లుగా ఉక్రెయిన్, రష్యా విరాజిల్లాయని, రెండు దేశాల ప్రజలు జీవించారని గుర్తుచేసింది. తొమ్మిదేళ్లుగా అక్కడ రక్తం చిందితూనే ఉందని, ఏడాదికిపైగా మారణహోమం కొనసాగుతోందని పేర్కొంది. ఇలాంటి పరిణామాలకు అమెరికా, నాటో, ఈయూ ప్రణాళికలే దారితీశాయని వెల్లడించింది. మార్కెట్ల ఆధిపత్యానికి, ముడిసరుకు, రవాణా నెట్వర్లు, యూరేసియా ప్రాంతంలో భౌగోళిక రాజకీయ మైలస్తంభాలపై నియంత్రణ కోసం కేపటలిస్టు రష్యాతో పోటీ నేపథ్యంలో అమెరికా, నాటో, ఈయూ కుతంత్రాలకు తమ రక్తంతో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్న ఉక్రెయిన్, రష్యా ప్రజలకు కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు అండగా నిలుస్తాయని సంఘీభావాన్ని సంయుక్త ప్రకటన ప్రకటించింది. ఫాసిస్టు చర్యలను, కమ్యూనిజం వ్యతిరేకతను, కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్లపై ఉక్కుపాదం మోపడాన్ని వ్యతిరేకించామని పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీలు ఏడాది పొడవునా తీసుకున్న చర్యలకు సెల్యూట్ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రజా కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తేగలిగినట్లు తెలిపింది. నాటో, అమెరికా సైనిక స్థావరాలు, పోర్టులు, రైల్వే స్టేషన్లు, రహదారులపై నిరసనలు, ప్రదర్శనలతో యుద్ధం కోసం కొత్త ఆయుధాలు పంపడాన్ని తీవ్రంగా నిరసించినట్లు పేర్కొంది.ప్రజా చైతన్య కార్యక్రమాల్లో కలిసిరావాలని భావసారూప్యతగల వర్గాలకు పిలుపునిచ్చింది. కార్మికవర్గం కూడా స్వతంత్ర పథాన్ని ఏర్పాటు చేసుకొని ఉద్యమాలను మరింత బోపేతం చేసుకోవాలని సూచించింది. సోషలిజం పునరుద్ధరణ ద్వారా శాంతిని నెలకొల్పవచ్చని, ప్రజల్లో మైత్రి, పరస్పర సహకారానికి అవకాశం కల్పించవ్చని వెల్లడించింది. ఈ ప్రకటన చేసిన పార్టీల్లో పీడీఎస్, అల్జీరియా, ఆస్ట్రేలియా లేబర్ పార్టీ, అజర్‌బైజన్, బంగ్లాదేశ్, బెల్జియం, కెనడా, గ్రీస్, మాల్టా, మెక్సికో, నార్వే, పలస్తీనా, ఫలిపైన్స్, సూడాన్, స్వీడెన్, స్విస్, సిరియా, టర్కీ, ఉక్రెయిన్, వెనిజులా, అర్జెంటైనా దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీలతో పాటు ఇరాన్ తేడే పార్టీ, ఐర్లాండ్ వర్కర్స్ పార్టీ, కజకస్తాన్ సోషలిస్టు మూవ్‌మెంట్, నెథర్లాండ్స్ న్యూ కమ్యూనిస్టు పార్టీ, అమెరికా కమ్యూనిస్టు వర్కర్స్ ప్లాట్‌ఫోరం, ఇటలీ కమ్యూనిస్టు ఫ్రంట్, రివల్యూషనరీ పార్టీ కమ్యూనిస్ట్స్ (ఫ్రాన్స్), జేవీపీ శ్రీలంక, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ ఉన్నాయి.

# ఉ.కొరియా మరో రెండు క్షిపణి ప్రయోగాలు

**సియోల్:** అణ్వాయుధాల తయారీ, ప్రయోగాలలో ఉత్తర కొరియా వేగం పెంచింది. వరుసగా అణ్వాస్త్రాలను ప్రయోగిస్తోంది. మొన్న సముద్రంలో సునామీ సృష్టించే సామర్థ్యంగల అస్త్రాన్ని ప్రయోగించింది. ఇప్పుడు భూమిపై నుంచి భూమిపై లక్ష్యాలు ఛేదించగల రెండు బాలిస్టిక్ మిసైళ్లను పరీక్షించింది. అయితే ఇందులో ఒకటి డమ్మీ కాగా మరొక దానిలో అణశక్తిని వినియోగించినట్లు తెలిసింది. న్యూక్లియర్ వార్‌హెడ్ (అణ్వాయుధం) 500 మీటర్లు ప్రయాణించి లక్షిత కిమ్‌చయేక్ ద్వీపకల్పం వద్ద పేలిపోయిందని ఈ మేరకు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) మంగళవారం నివేదించింది. అణు దాడి చేసే విధంగా ఆదేశాలివ్వడానికి అవసరమైన కార్యచరణతో పాటు లాంచ్ ఆథరైజేషన్ వ్యవస్థ సాధారణ పనితీరును నిర్ధారించుకునేందుకు ప్యాంగ్యాంగ్‌కు తాజా పరీక్షలు దోహదమైనట్లు వార్తానివేదిక పేర్కొంది. సోమవారం ఉత్తర కొరియా తమ పశ్చిమ తీరం నుంచి జపాన్ సముద్రం వైపుకు రెండు బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్లు జపాన్, దక్షిణ కొరియా వేర్వేరు ప్రకటనలు వెలువరించాయి. రెండు క్షిపణులు 50కిమీల ఎత్తులో 350కిమీలు ప్రయాణించి జపాన్ ఆర్థికజోన్ వద్ద పడ్డాయని పేర్కొన్నాయి.

## మే 28,29 తేదీల్లో రాజమహేంద్రవరంలో

# టీడీపీ మహానాడు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఉభయ తెలుగురాష్ట్రాల్లో మొత్తం 100 సభలు నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) పొలిట్‌బ్యూరో సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశాలను ఈ నెల 30 నుంచి ప్రారంభించి మహానాడు నాటికి ముగించాలని, ఇందుకోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 17 కీలక అంశాలకు సంబంధించి చర్చించారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 13, తెలంగాణకు సంబంధించి 4 అంశాలున్నాయి. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించే మహానాడుని ఈసారి రాజమహేంద్రవరంలో మే 28,29 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఎన్నికల మ్యానిఫెస్టోని భిన్నంగా రూపొందించేందుకు కసరత్తు నిర్వహించాలని, ఆర్థిక తారతమ్యం లేకుండా ఆదాయాన్ని అందరికీ పంచే విధంగా మ్యానిఫెస్టో రూపకల్పన చేసేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీడీపీ ఆవిర్భావానికి ముందు, ఆ తర్వాత రాజకీయాల్లో వచ్చిన భారీమార్పులను ఈ సమావేశం విశ్లేషించుకుంది. ఏప్రిల్ ఆఖరి వరకూ ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రూప కల్పన రూపొందించారు. నవంబర్‌లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పొలిట్ బ్యూరో భావించింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉండాలని పార్టీ క్యాడర్, లీడర్‌లకు దిశానిర్దేశం చేసింది. పార్టీ సభ్యత్వంలో జీవితకాల (లైఫ్ టైమ్) సభ్యులను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు 5 వేల రూపాయలు రుసుముగా పొలిట్ బ్యూరో నిర్ణయించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయంపై విశ్లేషణ చేసింది.

టీడీపీ అభ్యర్థులు పోటీ చేసిన మూడు స్థానాల్లో వైసీపీ ఓటర్లకు పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చినా కూడా ఓటర్లు ప్రభావితం కాలేదని, ఇదే చైతన్యాన్ని ఓటర్లు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ కొనసాగించేలా పార్టీ నాయకత్వం కృషి చేయాలని పొలిట్ బ్యూరో భావించింది. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 100 రూపాయల నాణాన్ని విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానించింది. ఈసమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రెండు రాష్ట్రాలకు చెందిన పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొన్నారు.

# జగన్ సర్కార్ దూకుడుకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

అమరావతిపై సుదీర్ఘ వాదనలు విని తీర్పు రాసేందుకు సమయం లేదని జస్టిస్ జోసెఫ్ తెలిపారు. పిటిషన్ దాఖలు చేసిన వారిలో కొంతమంది రైతులు చనిపోయారని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మరణించిన వారి తరపున ప్రతినిధులు ప్రతివాదులుగా ఉండేందుకు న్యాయవాదులు అనుమతి కోరారు. దానికి అనుమతిస్తూ వారికి వెంటనే నోటీసులు పంపాలని ప్రభుత్వ న్యాయవాదులను ధర్మాసనం ఆదేశించింది.

**సుప్రీం అసహనం**

సుప్రీంకోర్టులో కేసుల విచారణ జాబితా వరుస మారడంతో అమరావతి కేసుపై విచారణ ఆలస్యమైంది. మొదటి 5 కేసుల విచారణ తర్వాత 12వ నెంబర్ నుంచి 20వ నెంబర్ కేసు వరకు విచారణ జరుగుతుంది. ఆ తర్వాత 7వ నెంబర్ కేసు నుంచి 11వ నెంబర్ కేసు విచారణ జరుగుతుంది. ఆ తర్వాత 21 నుంచి 39, 41వ నెంబర్ కేసులను కోర్టు విచారిస్తుంది. ప్రస్తుతం 10వ నెంబర్ కేసుగా అమరావతి రాజధాని కేసు ఉంది. అయితే ప్రస్తుతం 8వ నెంబర్ కేసుపై విచారణ జరుగుతున్న సమయంలో అమరావతి కేసును ప్రస్తావించేందుకు ప్రభుత్వ న్యాయవాదులు యత్నించడంతో సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఒక కేసు సగం విచారణలో ఉండగా మరో కేసు ఎలా విచారించాలని జస్టిస్ కేఎం జోసెఫ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఒక కేసు విచారణ పూర్తి కాకుండా.. మరో కేసు విచారించడం కుదరదని స్పష్టం చేశారు.

# మంత్రి రజినీకి హైకోర్టు నోటీసు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో గ్రానైట్ తవ్వకాలపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మంత్రి విడదల రజనీ, ఎంపీ అవినాశ్‌రెడ్డి బంధువులు ప్రతాప్ రెడ్డి, స్వేతారెడ్డి, జీవీ దినేశ్‌రెడ్డి, శివపార్వతికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూముల్లో డీకే పట్టాలు రద్దుచేయకుండా గ్రానైట్ తవ్వకాలకు ఎన్వోసీ ఇవ్వడంపై హైకోర్టులో కొందరు రైతులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పిటిషనర్ తరపున న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. మొత్తం 21.50 ఎకరాల భూమిలో గ్రానైట్ తవ్వకాలకు ఎన్వోసీ ఇచ్చిన ఎమ్మార్వోకు నోటీసులు వెళ్లాయి. రైతులు పనులు చేస్తుంటే అడ్డుకున్న ఎస్ఐకి కూడా హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఒక్కో ఎకరాలో 200 కోట్ల విలువ చేసే గ్రానైట్ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. రైతులకు తెలియకుండా ఎన్వోసీ ఇవ్వడంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. దీనిపై విచారణ జరిపిన... తదుపరి విచారణను వచ్చేనెల 10కి వాయిదా వేసింది. అప్పటి వరకూ స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్లు దాఖలు చేయాల్సిందిగా మంత్రితో పాటు ఇతరులను హైకోర్టు ఆదేశించింది.

# దిల్లీకి అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

రూ.68 వేల కోట్లు ఖర్చుచేసి 71 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డ్యామ్‌సైట్‌లో 15 నెలల పాటు ఎలాంటి పనులు చేయకుండా గాలికొదిలేశారన్నారు. కేంద్ర జలమండలి(సీడబ్ల్యూసీ), హైదరాబాద్ ఐఐటీ వారు వచ్చి చెప్పేవరకు పోలవరం ప్రాజెక్టు పరిస్థితి సీఎంకుగానీ, అధికారులకుగానీ తెలియదన్నారు. పులిచింతల, గుండ్లకమ్మకు గేట్లు పెట్టలేని వారు పోలవరం ఎలా నిర్మించగలరని ప్రశ్నించారు. సీపీఐ చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు.

**పూర్తిస్థాయి నిర్మాణానికి చర్యలు: గిడుగు రుద్రరాజు**

ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన చట్టం ద్వారా పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తే టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా కేంద్రం 10 శాతం నిధులు కూడా ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించటం ద్వారా గతంలో పేర్కొన్న నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేకుండా తప్పించుకుంటున్నారని చెప్పారు. పూర్తిస్థాయిలో పోలవరం నిర్మించటానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**గిరిజనులకు అన్యాయం: బాబూరావు**

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ గిరిజనులకు పునరావాసం లేకుండా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. 138 అడుగుల ఎత్తు నీరు వస్తేనే పోలవరం కాంటూరు ముంపుకు గురైయిందని గుర్తు చేశారు. 18ఏళ్లు నిండిన ప్రతి గిరిజనుడికి నష్టపరిహారం ఇస్తానన్న జగన్ వాగ్దానం ఏమైయిందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు బాగుపడాలని, గిరిజనులకు అన్యాయం చేయటమే ప్రభుత్వాల పనిగా ఉందని విమర్శించారు.

**డ్యాన్సులేసే వారు డ్యామ్‌లు కడతారా: పోతిన మహేశ్**

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ మాట్లాడుతూ 41 మీటర్ల ఎత్తుకు కుదిస్తే జీవనాడి చచ్చిపోతుందన్నారు. పోలవరం అంచనాలను పదేపదే కేంద్రం ఎందుకు సవరిస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. డ్యాన్సులేసే వారు మంత్రులుగా ఉంటే డ్యామ్‌లు ఎలా నిర్మిస్తారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు జగన్ అమ్ముడుపోయాడనే అనుమానం కలుగుతుందన్నారు. ఎత్తు తగ్గిస్తే బ్యారేజీగా కూడా పోలవరం ఉపయోగపడదన్నారు.

**ఎత్తు తగ్గించే హక్కు ఎవరికీ లేదు: భవానీప్రసాద్**

రైతు సంఘం నాయకులు అక్కినేని భవానీప్రసాద్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే హక్కు ఎవరికీ లేదని, కానీ ఇది బీజేపీ ప్రభుత్వం కుట్ర అని అభివర్ణించారు. రాష్ట్రంలో నీటి వనరులను సద్వినియోగం చేసుకోవటం, వ్యవసాయం అభివృద్ధి, పరిశ్రమల అవసరాలు తీర్చటం కోసం పోలవరాన్ని డిజైన్ చేశారని వివరించారు. పోలవరం పూర్తిస్థాయిలో నిర్మాణం రాజకీయ పక్షాల ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు.

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగర కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, పెన్మెత్స దుర్గాభవాని, నగర, జిల్లా నేతలు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన దీక్షలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు.

**కర్నూలులో**

రెండవ రోజులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నిరసన దీక్షలు జరిగాయి. కర్నూలులో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాలలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు దీక్షలు ప్రారంభించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దీనిని ఎత్తు తగ్గిస్తే మినీ ప్రాజెక్టుగా మారుతుందన్నారు. యథావిధిగా ప్రాజెక్టు ఎత్తు కొనసాగించి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ఏలూరులో**

ఏలూరు కలెక్టరేట్ వద్ద రెండో రోజు దీక్షల్లో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిస రాము, మైసాక్షి వెంకటాచారి, సన్నేపల్లి సాయిబాబు, జమ్మి శ్రీను, కారం ధారయ్య, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

**భీమవరంలో**

భీమవరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద సీపీఐ అధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు, సికిలే పుష్పకుమారి, నెక్కంటి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురంలో:** అమలాపురంలో సీపీఐ అధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేశ్, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు నాయకత్వం వహించారు.

**రాజమహేంద్రవరంలో**

స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన సీపీఐ ధర్నాలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సీపీఐ నిడదవోలు కార్యదర్శి ఎం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జగన్ మౌనం వీడాలి: జల్లి విల్సన్**

పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాపట్ల కలెక్టరేట్ రోడ్‌లో సామూహిక దీక్ష చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గించే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిస్థాయి 45.72 మీటర్ల నీటిమట్టంతో నిర్మించి ఆంధ్రప్రదేశ్‌లో నీటి కొరతను తీర్చే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు కట్టాలని ప్రయత్నిస్తే, ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ఎత్తు తగ్గిస్తామన్నా నోరు మెదపకపోవడం దారుణమని, ఇకనైనా ఆయన మౌనం వీడి ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అంతా హడావుడే...

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. మంగళవారం వచ్చిన వారిలో అనేకమంది వారి సహాయకులే ప్రతినిధులుగా ఉండటం గమనార్హం. కేవలం వంద మంది మాత్రమే ప్రతినిధులుగా తొలి రోజు సదస్సుకు హాజరైనట్లు సమాచారం. ఇందులో విదేశీ ప్రతినిధులు కేవలం 20 నుంచి 30 మంది మాత్రమే ఉంటారని, మిగతా వారంతా వారి సహాయకులేనని అక్కడున్న కొంతమంది అధికారులు అంటున్నారు. కేవలం సాంస్కృతిక సంబరాలకే రెండు కోట్లు ఖర్చు చేస్తున్నారు. పోలీసులు యూనిఫామ్‌తో కాకుండా 150 మంది వరకూ డ్రెస్ కోడ్‌తో భద్రతా ఏర్పాట్లు చూస్తున్నారు. మరో పక్క మీడియా ప్రతినిధులకు ఎలాంటి అనుమతి లేదు. కొంతమందికే పీఐబీ అధికారులు పాసులు మంజూరు చేసినప్పటికీ సమావేశాల వేదిక లోపలికి అనుమతి లేకుండా పోయింది. తొలిరోజు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ మంగళవారం ఉదయం రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభమైంది. సాగరిక హాల్లో ప్రతినిధులు అంతా కలిపి 50 మంది కూడా ఉండరని కొంతమంది అధికారులు తెలియజేశారు. అయితే విదేశీ ప్రతినిధులకు విశాఖ అందాలను చూపించేందుకు జీవీఎంసీ అధికారులు నానా తంటాలు పడ్డారు. విశాఖ విమానాశ్రయం నుంచి ప్రతినిధులు వచ్చే రోడ్డు మార్గం వెంబడి పెయింటింగ్‌లు, గ్రీన్ బెల్ట్ ఆధునీకరణ, విద్యుదీకరణతో పాటు రోడ్లు నిర్మించారు. అసీలుమెట్ట ఫ్లై ఓవర్ పైన రోడ్లు తళతళ మెరుస్తుంటే, క్రింద ప్రజలు వెళ్లే రహదారులన్నీ గోతులతో నరకప్రాయంగా మారాయి. అధికారులు కేవలం విదేశీ ప్రతినిధులకు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు మాత్రమే రెడ్ కార్పెట్ వేసి, విశాఖ ఓహో అహో అనిపించేలా సాగర తీరంలో మెరుపులతో ప్రజాధనాన్ని వృథా చేశారని అనేక ప్రజా సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. సీఎం జగన్ విశాఖలో నివాసం ఉండడానికి వస్తున్నందున సాగర తీరంలో జీ20 పేరిట ఈ సుందరీకరణ అభివృద్ధి పనులు చేపట్టారని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఆరోపించారు.

# ఈపీఎఫ్‌ఓలో ఓబీసీలకు స్థానమేది?

## కేంద్రాన్ని నిలదీసిన పార్లమెంటరీ కమిటీ

**న్యూదిల్లీ:** ఈపీఎఫ్ఓ సంస్థకు సంబంధించి ఉన్నతస్థాయిలో కనీసం ఒక్క ఓబీసీ అభ్యర్థి కూడా లేకపోవడంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తంచేసింది. ఈపీఎఫ్‌ఓలో ఓబీసీలకు కనీసం ప్రాతినిధ్యమే లేదని మండిపడింది. ఈపీఎఫ్ఓ ఉన్నతస్థాయి బోర్డులో ఓబీసీ అభ్యర్థుల నియామకానికి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర కార్మికమంత్రిత్వశాఖను పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది. ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమంపై పార్లమెంటరీ తాత్కాలిక కమిటీ తన 19వ నివేదికను సోమవారం పార్లమెంటు ముందు పెట్టింది. కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ పరిధిలో గల ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)లో ఓబీసీలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని నివేదిక స్పష్టంచేసింది. ఈపీఎఫ్ఓ ఉన్నతస్థాయి సంస్థలో ప్రస్తుత ఉద్యోగుల వివరాలు పరిశీలిస్తే...చైర్మన్, సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్, మెంబర్ సెక్రటరీ సహా మొత్తం 41 మంది అధికారులు ఉన్నారు. అయితే, మేనేజ్‌మెంట్ బోర్డులో ఓబీసీ కేటగిరీకి చెందిన ఒక్కరు కూడా లేరని పార్లమెంటరీ కమిటీ నివేదిక తెలిపింది. బోర్డు డైరెక్టర్లను ప్రభుత్వమే నేరుగా నియమిస్తుందని, ఈ నియామకాలకు రిజర్వేషన్ల నిబంధన ఏదీ లేదని కమిటీ వెల్లడించింది.సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ సభ్యుల నియామకానికి సంబంధించి ఓబీసీ కేటగిరీ నుంచి అభ్యర్థులు ముందుకు వస్తే వారికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టంచేసింది. ఈపీఎఫ్ఓలోని అన్ని స్థాయిల్లో ఓబీసీ ఉద్యోగుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని పేర్కొంది. గ్రూప్ ఏ, బీ, సీ కేటగిరీ పోస్టులకు వరుసగా 15.91 శాతం, 10.89 శాతం, 19.88 శాతం ఉద్యోగులు మాత్రమే ఉన్నట్లు వెల్లడించింది. ఈపీఎఫ్ఓలో ఓబీసీల ప్రాతినిధ్యానికి సంబంధించి డేటా సక్రమంగా లేకపోవడంపై కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

# ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.15 శాతం

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా 2012-13లో అది 8.5 శాతానికి పెరిగింది. 2013-14లో 8.75 శాతం, 2014-15లో 8.75 శాతం, 2015-16లో 8.8 శాతం, 2016-17లో 8.65 శాతం, 2017-18లో 8.55 శాతం, 2018-19లో 8.65 శాతం, 2019-20లో 8.5 శాతం, 2020-21లో 8.5 శాతం, 2021-22లో 8.1 శాతం ఉంది. నాలుగు దశాబ్దాల కాలంలో ఈపీఎఫ్‌పై వడ్డీరేటు అతితక్కువగా 8.1 శాతం ఖరారు చేశారు. 1977-78లో ఈపీఎఫ్‌పై వడ్డీరేటు కేవలం 8 శాతం మాత్రమే. కేంద్ర కార్మికశాఖమంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈపీఎఫ్ఓ నిర్ణయాత్మక సంస్థ సెంట్రల్ బోర్డు ట్రస్టీ వడ్డీరేటును 8.15 శాతంగా ఖరారు చేసింది. పీఎఫ్‌పై వడ్డీరేటును 8.20 శాతంగా నిర్ణయిస్తే రూ.112.78 కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అదే 8.25 శాతమైతే రూ.438.34 శాతం అవుతుందని సీబీటీ తెలిపింది.

# విజయాలు సాధించేకొద్దీ విపక్షం దాడి చేస్తుంది

## బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని మోదీ

**న్యూదిల్లీ:** ఎన్నికల్లో బీజేపీ ఎన్ని ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తే... అంతే స్థాయిలో ప్రతిపక్షాల నుంచి నిరసనలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని తాను గుజరాత్ ఎన్నికల సమయంలోనే ప్రస్తావించానని చెప్పారు. రాజకీయ నాయకులు రాజకీయేతర ప్రయోజనాల కోసం పని చేయాలని కోరారు. మంగళవారం ఇక్కడ జరిగిన బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నుంచి ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతికి మధ్య కాలాన్ని సామాజిక న్యాయం కోసం కేటాయించాలని ఎంపీలను కోరారు. ఈ విషయాలను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మీడియాకు వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 15 నుంచి నెల రోజుల పాటు ఆయా నియోజకవర్గాల్లో వివిధ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని మోదీ పార్టీ ఎంపీలను కోరారు. భూమాత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనను విషపూరితం చేసే రసాయనాల నుంచి విముక్తి కల్పించాలని భూమాత ఏడుస్తోందని అన్నారు. రాజకీయ నాయకులు రాజకీయేతర ప్రయోజనాల కోసం పనిచేయాలని, అలాగే వారు సమాజంపై చాలా ప్రభావాన్ని చూపుతారని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'బేటీ బచావో' (ఆడబిడ్డలను కాపాడండి) కోసం గుజరాత్ ప్రభుత్వం చేసిన కృషిని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడానికి నిపుణుల సేవలను ఉపయోగించుకోవాలని ఎంపీలను కోరారు.

ప్రతిపక్షాల నిరంతర నిరసనలను ప్రస్తావిస్తూ... బీజేపీ మరిన్ని ఎన్నికలలో విజయం సాధిస్తున్న కొద్దీ ఇలాంటి ఆందోళనలు మరింత తీవ్రమవుతాయన్నారు. పార్టీ మరింత తీవ్రమైన, దిగువ స్థాయి దాడులను ఎదుర్కొంటుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఇదే.

# మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

దుయ్యబట్టింది. అయితే ఆటంకాల నడుమ అనుకున్న సమయానికి ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట ఎర్రకోట నుంచి కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కారు. పోలీసుల బారికేడ్ల నుంచే తమ ప్రదర్శనను చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. మోదీ-అదానీ భాయి భాయి నినాదాలు మార్మోగాయి. పార్టీ సీనియర్లు పి.చిదంబరం, అధిర్ రంజన్ చౌదరి, జైరాం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు కలిసి నడిచారు. చాందినీ చౌక్‌లోని టౌన్‌హాల్ వరకు సాగాల్సిన మార్చ్‌ను శాంతి, భద్రతల సమస్య వస్తుందన్న నెపంతో దిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను నిర్బంధించారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అరెస్టు చేసే సమయంలో నాయకులు, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. నేతల అరెస్టుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

# పులివెందులలో కాల్పుల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో సమావేశమయ్యారు. ఆర్థికలావాదేవీల విషయంలో మాటామాటా పెరిగింది. దీంతో తన వద్ద ఉన్న తుపాకీతో మస్తాన్, దిలీప్‌లపై భరత్‌యాదవ్ ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డాడు. మస్తాన్ ఎడమచేతికి, దిలీప్‌కుమార్ చాతికింద ఎడమవైపు బులెట్లు దిగాయి. తీవ్రంగా గాయపడిన దిలీప్, మస్తాన్‌లను వైద్యచికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా దిలీప్‌కుమార్ మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడిన మస్తాన్‌ను కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

పులివెందుల పట్టణానికి చెందిన గోర్ల భరత్‌యాదవ్ పాత్రికేయుడుగా కొనసాగుతున్నాడు. మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో భరత్‌యాదవ్ అనుమానితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. భరత్‌యాదవ్‌ను సీబీఐ అధికారులు చాలాసార్లు విచారించినట్లు తెలిసింది. కాల్పుల అనంతరం భరత్‌యాదవ్ లొంగిపోయినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# తాడో...పేడో తేల్చుకుంటాం

- రహదారి కోసం చిందేపల్లె వాసుల ఆమరణ దీక్ష
- క్షీణిస్తున్న జనసేన నేత వినుత కోట ఆరోగ్యం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రహదారి కోసం ఆందోళన చేస్తున్న ఆ గ్రామ వాసులు చావో... రేవో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. దౌర్జన్యంగా మూసేసిన రహదారిని పునరుద్ధరించేవరకు పోరాడతామంటూ ఆమరణ దీక్షకు దిగారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లెలో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ పరిశ్రమ వారు మూసేసిన రహదారి తెరవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సోమవారంనుంచి గ్రామస్తులు స్థానిక శివాలయం వద్ద ఆమరణ దీక్ష చేపట్టారు. కాగా చిందేపల్లె వాసులకు మద్దతుగా జనసేన పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి వినుత కోట, ఆమె భర్త చంద్రబాబు ఆమరణ దీక్షలో కూర్చున్నారు. వీరితోపాటు చిందేపల్లెకే చెందిన చెంచురెడ్డి, మహానందరెడ్డి, మోహనరెడ్డి, చెంచురామయ్య, లోకేశ్, వెంకటసుబ్బయ్య రాయల్, వెంకటరత్నం, తులశమ్మ, రేణుక, భారతి, సాయికుమార్, దిల్లీబాబు, అనిల్ కుమార్, శ్రీనివాసులు, గిరిప్రసాద్ అనే మొత్తం 17మంది ఆమరణ దీక్ష చేస్తున్నారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆమరణ దీక్షకు కూర్చున్న జనసేన మహిళా నేత వినుత కోట ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోంది. ఆమెతో పాటు దీక్షకు కూర్చున్న మరికొంతమంది ఆరోగ్య పరిస్థితి కూడా క్షీణిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లెకు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి వెళ్లే రహదారిని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (ఈసీఎల్) పరిశ్రమ వారు ఈ నెల 18వ మూసివేశారు. రెవిన్యూ, పోలీసుల సహకారంతో రహదారికి అడ్డంగా గోడను నిర్మించేశారు. ఈ కారణంగా చిందేపల్లెకు వెళ్లే రహదారి మూతపడింది. వాస్తవానికి ఇది రోడ్లు, భవనాల శాఖ పరిధిలోఉంది. ఈ రహదారి సుమారు ఎనిమిది దశాబ్దాలుగా వాడుకలో ఉంది. 1993-94 ప్రాంతంలో ల్యాంకో పరిశ్రమ ఏర్పాటు చేశారు. అయినా మూడు దశాబ్దాలుగా ఈ రహదారి గుండా చిందేపల్లెతో పాటు ఐదు గ్రామాల వాసులు వెళుతున్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అయితే ఇటీవల పరిశ్రమ యాజమాన్యం మారడంతో రహదారి సమస్య ఉత్పన్నమైంది. ఈ దారి గుండా వెళ్లకూడదని వారు అభ్యంతరం తెలపగా, చిందేపల్లె వాసులు వ్యతిరేకించారు. తరతరాలుగా ఉన్న రహదారిని ఎలా మూస్తారు? ఈ మార్గం లేకపోతే తమకు కష్టమని పరిశ్రమ యజమాన్యానికి, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న ఓ నేత సహకారంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ నెల 16న చిందేపల్లె రహదారిని పూర్తిగా మూయించారు. ఆ రోజు చిందేపల్లె వాసులు పోరాటం చేస్తూనే ఉన్నారు. సీపీఎం, జనసేన, మానవ హక్కుల వేదిక, తెలుగుదేశం పార్టీ వీరి ఆందోళనకు మద్దతు పలికినా పరిశ్రమ యాజమాన్యం దిగి రాలేదు. పోలీసుల సాయంతో పోరాటానికి అణచి వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆందోళన కారులపై లాఠీఛార్జీ కూడా చేయించారు. జనసేన నేతలతో పాటు మరో తొమ్మిది మందిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. ఇక ఆందోళన చేస్తున్న స్థానికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి బుచ్చినాయుడు కండ్రిగ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ నేపథ్యంలో జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి వినుత కోట, ఆమె భర్త చంద్రబాబు, గ్రామానికి చెందిన 12మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఆమరణ దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా గ్రామస్తులంతా రిలే దీక్షలు చేస్తున్నారు.

### కదలని అధికార యంత్రాంగం

రహదారి సమస్యను పరిష్కరించాలని చిందేపల్లె శివాలయం వద్ద 17మంది రెండ్రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం కదలక పోవడం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు పరిశ్రమ నిర్వాహకులకు అండగా నిలుస్తున్నారు తప్ప... తరతరాలుగా ఉన్న రహదారిని కొనసాగించడానికి సహకరించడం లేదు. ఇందుకు కారణం అధికారులపై పాలకుల ఒత్తిడేనని తెలుస్తోంది. ఆమరణ దీక్ష శిబిరం వద్దకు పోలీసులు నామమాత్రంగా వచ్చి చూసి వెళ్లారే తప్ప... వారి సమస్య పరిష్కరిస్తామని మాత్రం హామీ ఇవ్వలేదు. ఆమరణ దీక్షలో కూర్చున్న వారి ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి చిందేపల్లె వాసుల రహదారి సమస్యను పరిష్కరించాలి. లేదంటే ఈ పోరాటం మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉంది.

## 36 గంటల దీక్ష జయప్రదం చేయండి

### ఆంధ్రప్రదేశ్‌చేనేత కార్మికసంఘం పిలుపు

విశాలాంధ్ర-మంగళగిరి: చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 3,4 తేదీలలో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో జరిగే 36 గంటల దీక్షలో చేనేత అనుబంధ వర్గాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గుంటూరుజిల్లా మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ఒక వైపు చేనేత చీరలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయని, ఉగాది పండగ ముందు వచ్చే ముహూర్తాలకు ఇక్కడున్న నిల్వలు ఏమాత్రం తగ్గలేదన్నారు. డిమాండుకు మించిన చీరలు తయారు కావడమే ఇందుకు కారణమన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.1.5 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చేనేతపై జీఎస్టీ తొలగించాలని, చేనేత అనుబంధరంగ కార్మికులతో పాటు కూలి నేతకారులకు కూడా నేతన్ననేస్తం ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకూ దశల వారీగా పోరాటం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహనరావు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర అధ్యయనశీలి రాజేశ్వరరావు

### సంస్మరణ సభలో రామ్మోహన్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: చెన్నమనేని రాజేశ్వర రావు మృతితో సమాజం అరుదైన మేధావిని, నిరంతర అధ్యయనశీలినీ, వరిష్ఠ పాత్రికేయుడిని కోల్పోయిందని తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు విచారం వ్యక్తం చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యుజే, మెఫీ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సంయుక్త అధ్వర్యంలో మంగళవారం జరిగిన రాజేశ్వరరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ముక్కుసూటి తనం, రాజీపడని మనస్తత్వం, నీతి, నిజాయతీ, నిర్భీతిగా వృత్తి ధర్మం నిర్వర్తించిన ఉత్తమ పాత్రికేయుడు రాజేశ్వరరావు అని రామ్మోహన్‌రావు కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ, సామాజిక అంశాలన్నింటినీ తర్కంతో విశ్లేషించగలిగిన మేధావి రాజేశ్వరరావు అని నివాళి అర్పించారు. సమకాలీన రాజకీయాలపై ఆయనకు కొంత హేయభావం ఉన్నప్పటికీ ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ అని ముక్తాయింపు చేసేవారని శ్రీనివాస్‌రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యుజే, తెలంగాణలో టీయూడబ్ల్యుజే పట్ల రాజేశ్వరరావు సానుకూలంగా వ్యవహరించేవారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీ, జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ తదితర సంస్థల ఏర్పాటులో రాజేశ్వరరావు పాత్ర ఎంతో ఉందన్నారు.

జర్నలిస్టులు ప్రభుత్వాలకు చీర్ లీడర్స్‌గా కాకుండా ప్రజల పక్షాన నిలబడాలని నిరంతరం తపించే ఆదర్శ పాత్రికేయుడు రాజేశ్వరరావు అని శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ .ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ రాజేశ్వరరావు నడిచే గ్రంథాలయమని, పుస్తక పఠనం దినచర్యలో భాగమైతే, పట్టుబట్టి జర్నలిస్టులతో వాటిని చదివించడం ఓ ఉద్యమంగా భావించేవారని గుర్తుచేశారు. వందల పుస్తకాలు చదవడమే కాకుండా అందులోని విషయాలు గుర్తుపెట్టుకొని అవసరమైన చోట వాటిని ఉటంకించేవారని అమర్ అన్నారు.

సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ ఎందరో ప్రముఖులతో రాజేశ్వరరావుకు సన్నిహిత సంబంధాలు ఉన్నా, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఏనాడూ వినియోగించ లేదన్నారు. చేతిలో పుస్తకం పట్టుకుని చదువుతూ తుదిశ్వాస విడవాలనేది ఆయన కోరిక అని, చివరిదాకా పుస్తకాలు చదువుతూ, వాటి గురించి మిత్రులతో చర్చిస్తూనే శాశ్వతంగా వెళ్లిపోయారన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ మాట్లాడుతూ చివరి ఊపిరి వరకు వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో, నిజాయతీగా నిర్వర్తించిన రాజేశ్వరరావు జీవితం నేటితరం జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకమన్నారు. రాజేశ్వరరావు సతీమణి సీహెచ్ అంజనీ, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్లు వి.కొండలరావు, కె.యాదగిరి, ప్రముఖ వక్త కృష్ణ సాగర్, ఏపీ ప్రభుత్వ ఇంధనశాఖ సీఈఓ ఎ.చంద్ర శేఖర్ రెడ్డి, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవికాంత్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. రాజేశ్వరరావు జ్ఞాపకాలను స్మరిస్తూ ప్రముఖులు రాసిన 'మీతో మా జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## పెంచిన వేతనాలేవి?

### ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులకు వేతనస్కేల్ పెంచి నాలుగేళ్లయినా ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు ప్రశ్నించారు. ఏపీ జేఏసీ అమరావతి దశలవారీ ఉద్యమంలో భాగంగా మంగళవారం విజయవాడ ఏపీ గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మత్స్యశాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధిపతులు కార్యాలయాల అధికారులు, సిబ్బందిని జేఏసీ నేతలు కలిసి వారి మద్దతు కోరారు. బొప్పరాజు, దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని సీఎం జగన్‌కు చాలాసార్లు విన్నవించినా స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. సీపీఎస్ రద్దు హామీతోపాటు ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, ఆరోగ్యకార్డులు పూర్తిగా వినియోగంలోకి తేకపోవడం, కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం తదితర అనేక ఆర్థిక, ఆర్థికేతర అంశాలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి కో-చైర్మన్ ఎస్.మల్లేశ్వరరావు, కార్యదర్శి ఎ.సాంబశివరావు, రెవెన్యూ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రవీణ్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ వాయిదా

### జూన్ 3 నుంచి 9 వరకు నిర్వహించాలని నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వాయిదా పడింది. ఏప్రిల్ 23 నుంచి 29 వరకు జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్‌ను జూన్ మొదటి వారానికి వాయిదా వేసింది. జూన్ 3 నుంచి 9 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. 2022 సివిల్స్ మూడో విడత ఇంటర్వ్యూలు ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు ప్రకటించడంతో గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను యూపీఎస్సీ విడుదల చేసిన విషయం విదితమే. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకునే ఏపీపీఎస్సీ మెయిన్స్ వాయిదా వేసినట్లు సభ్యులు సలాబ్‌బాబు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూలకు రాష్ట్రం నుంచి దాదాపు 25 మంది గ్రూప్-1 అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ ఇంటర్వ్యూల కారణంగా గ్రూప్-1 మెయిన్స్‌ను జూన్‌లో నిర్వహించాలని ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రూప్-1 మెయిన్స్‌కు నిర్దేశించిన నెలరోజుల సమయం చాలబోదంటూ వివిధ నిరుద్యోగ, యువజన సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వానికి, ఏపీపీఎస్సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశాయి. అతి తక్కువ వ్యవధిలోనే గ్రూప్-1 మెయిన్స్ విధించడం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ఎట్టకేలకు మెయిన్స్ పరీక్షలను జూన్‌కు వాయిదా వేయడంతో అభ్యర్థుల ప్రిపరేషన్‌కు కొంత సమయం కలిసి వచ్చింది. ఈ పరీక్షలు వాయిదా వేయడం పట్ల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## కొత్త జిల్లాల్లోనూ పది మూల్యాంకనం

### ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు ఎస్టీయూ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొత్తగా ఏర్పాటైన 13 జిల్లాల్లోనూ ఈ ఏడాది పదో తరగతి మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డికి మంగళవారం ఎస్టీయూ నేతలు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. పాత 13 జిల్లాలను ఈ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 26 జిల్లాలుగా మార్చిందని, దీంతో పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాలనూ 26 జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని, అప్పుడే ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. అన్ని జిల్లా కేంద్రాలలో మూల్యాంకన కేంద్రాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల భవనాలు సిద్ధంగా ఉన్నాయని, అలాంటి వాటిని గుర్తించి తక్షణమే అన్ని కొత్త జిల్లాలలో వీలైన చోట్ల పది మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకించి నంద్యాల జిల్లా కేంద్రంలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయకపో వడం బాధాకరమని తెలిపారు. నంద్యాల జిల్లా 29 మండలాలతో ఉందని, నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ చాగలమర్రి ప్రాంతాలకు కర్నూలు జిల్లా కేంద్రం దాదాపు 150 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని ఇలాంటి పరిస్థితుల్లో కర్నూలులో ఏర్పాటు చేసే మూల్యాంకన కేంద్రానికి నంద్యాల జిల్లా ఉపాధ్యాయులు హాజరవ్వడం అసౌకర్యంగా ఉంటుందని, అందువల్లే నంద్యాల జిల్లా కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్టీయూ నేతలు కోరారు.

### మార్గదర్శి కేసులో

## రామోజీరావుకు సీఐడీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ అక్రమంగా డిపాజిట్లు సేకరించిందనే ఆరోపణలపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వివిధ బ్రాంచి మేనేజర్లను అరెస్ట్ చేసిన సీఐడీ...తాజాగా సంస్థ ఎండీ శైలజతో పాటు రామోజీ గ్రూప్ చైర్మన్ రామోజీరావుకు నోటీసులు జారీ చేసింది. మార్గదర్శి అక్రమాల కేసు విచారణలో భాగంగా అధికారులు ప్రశ్నించేందుకు అందుబాటులో ఉండాలని రామోజీరావుతో పాటు శైలజకు నోటీసులు పంపింది. ఇందుకోసం సీఐడీ అధికారులు నాలుగు తేదీలను వీరిద్దరికీ సూచించారు. మార్చి 29, 31, ఏప్రిల్ 3, ఏప్రిల్ 6 తేదీల్లో ఒకరోజు విచారణకు అందుబాటులో ఉండాలని వేర్వేరు నోటీసుల్లో సీఐడీ అధికారులు పేర్కొన్నారు. విచారణ కోసం ఇల్లు లేదా ఆఫీసుల్లో అందుబాటులో ఉండాలని కోరారు. మార్గదర్శి సంస్థ ఆఫీసులపై తీవ్రచర్యలు తీసుకోకుండా తెలంగాణ హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో ఉన్న మార్గదర్శి సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు ఏపీలోని ఇతర బ్రాంచ్ ఆఫీసులపైనా, అందులో పనిచేసే సంస్థలపైనా తీవ్ర చర్యలు తీసుకోకుండా తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో... సీఐడీ తాజాగా ఈ కేసులో ముఖ్యనిందితులుగా పేర్కొన్న రామోజీరావు, శైలజలను ప్రశ్నించేందుకు సిద్ధమవుతోంది

## రాహుల్ అనర్హతపై మన ఎంపీలు స్పందించరా?

### కేవీపీ రామచంద్రరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా అనర్హత వేటు వేయడంపై రాష్ట్ర ఎంపీలు స్పందించకపోవడం సిగ్గుచేటని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు పేర్కొన్నారు. దేశ రాజధాని దిల్లీలో చక్రం తిప్పానని చెప్పుకునే చంద్రబాబు...రాహుల్ అనర్హతపై మౌనంగా ఉండటం తగదని వ్యాఖ్యానించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఏ ప్రముఖ నాయకుడూ ఈ ఘటనపై స్పందించకపోవడం తెలుగు జాతికి సిగ్గుచేటని కేవీపీ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాలు ప్రజాస్వామ్యంపై దాడి చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. మేధావులు, విద్యావంతులు, ప్రజాసంఘాల మద్దతుతో కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుందన్నారు. దేశంలో అనాగరిక ప్రజాస్వామ్యం నడుస్తోందన్నారు. భారత్ ప్రతిష్ఠను మంటగలిపేలా రాహుల్ మాట్లాడారని ఆరోపిస్తూ ప్రభుత్వమే పార్లమెంటులో అల్లరి చేయ డం, చర్చను పక్కదారి పట్టించడం దారుణమని మండిపడ్డారు. బ్యాంకులను దోచుకున్న నీరవ్ మోదీ, లలిత్ మోదీలకు మద్దతుగా కేంద్రం నిలు స్తోందన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. ప్రధాని చర్యలు ప్రజాస్వామ్యానికి హాని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా ఎంపీలు ఉన్నప్పటికీ... రాహుల్‌పై అనర్హత వేటును ఖండించకపోవడం చూస్తే...మాజీ ఎంపీగా తాను సిగ్గు పడుతున్నానని చెప్పారు. వామపక్షాలు, మేధావులు, విద్యావంతులు, పౌరసంఘాల నేతలు రాహుల్‌కు మద్దతుగా సంఘీభావం ప్రకటించాలని కోరారు. ప్రజలంతా ఏకమై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకో వాలని అభ్యర్థించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, లాం తాంతియా కుమారి, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి, వి.గురునాథం, పీవై కిరణ్, టి.యలమందారెడ్డి, కొలనుకొండ శివాజీ, మేడా సురేశ్, మీసాల రాజేశ్వరరావు, సతీశ్, ఖాజా మొహిద్దీన్, గొల్లు కృష్ణ, ధనేకుల మురళి, దాస్, ఖుర్షీదా పాల్గొన్నారు.

## రైళ్లపై రాళ్ల దాడికి పాల్పడితే కఠిన చర్యలు

### దక్షిణ మధ్య రైల్వే భద్రతా దళం

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): రైళ్లపై రాళ్లు రువ్వడం వంటి చర్యల వల్ల ప్రయాణీకులకు తీవ్ర గాయాలవుతాయని, రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, ఒకవేళ అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ప్రజలను దక్షిణ మధ్య రైల్వే భద్రతా దళం (ఆర్‌పీఎఫ్) హెచ్చరించింది. ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లపై రాళ్ల దాడి చేయటం ఆర్‌పీఎఫ్ చట్టం ప్రకారం శిక్షార్హమైనదని, ఈ సమస్యను అరికట్టడానికి అందరి సహకారం అవసరమని అన్నారు. రైళ్లపై రాళ్లు రువ్వడం నేరమని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపింది. ఇటీవలి కాలంలో కాజీపేట-ఖమ్మం, కాజీపేట-భువనగిరి, ఏలూరు-రాజమండ్రి వంటి సమస్యాత్మక మార్గాల్లో వందే భారత్ రైళ్లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. గత జనవరి నుంచి రైళ్లపై రాళ్ల దాడి వంటి ఘటనలు 9 చోటుచేసుకోవడంతో పాటు విలువైన ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లమే కాకుండా రైలు రీషెడ్యూల్‌కు దారితీసినట్లు వివరించింది. దీంతో ప్రయాణికులంతా అసౌకర్యానికి గురవుతున్నారని, రైలుపై రాళ్లు రువ్వడం వల్ల ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారని, ఆర్పీఎఫ్ అనేక కేసులు నమోదు చేసి 39 మంది నేరస్తులను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు తెలిపింది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు, చూసిన వ్యక్తులు సమాచారాన్ని ఆర్‌పీఎఫ్ ద్వారా తక్షణ చర్య కోసం 139కి డయల్ చేయడం ద్వారా తెలియజేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ జాతీయ ఆస్తులకు నష్టం కలిగించటం వలన ప్రయాణీకులకు తీవ్ర గాయాలు కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దలు వారి చిన్నపిల్లల చేష్టల కారణంగా కలిగే తీవ్రమైన పరిణామాల గురించి వారికి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ సబ్ ప్లాన్‌కు రూ.13,112 కోట్ల ఖర్చు

- 100 శాతం నిధులు చేరేలా చర్యలు
- నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన రూ.18,518.29 కోట్లలో ఫిబ్రవరి మాసాంతానికి రూ.13,112.36 కోట్లు (70.81 శాతం) నిధులు ఖర్చయినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. సబ్ ప్లాన్ నిధుల వినియోగం మరింతగా పెరగాలని, ఎస్సీల కోసం కేటాయించిన నిధులన్నీ వారి సంక్షేమానికే ఉపయోగపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఎస్సీ సబ్ ప్లాన్(ఎస్సీ కాంపొనెంట్) కు చెందిన 30వ నోడల్ ఏజెన్సీ సమావేశంలో నాగార్జున సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ప్రధాన ప్రభుత్వ శాఖల్లో 43 శాఖల అధికార ప్రతినిధులు సమావేశంలో పాల్గొని తమ శాఖల ద్వారా ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వ్యయాన్ని వివరించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమైన శాఖలకు ప్రభుత్వం రూ.18,518.29 కోట్లను ఎస్సీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిందన్నారు. వివిధ శాఖలు సబ్ ప్లాన్ ద్వారా తాము ప్రతిపాదించిన పనుల కోసం అదనపు బడ్జెట్ కావాలని కోరడం, ప్రభుత్వం ఆ విధంగానే అదనపు బడ్జెట్‌ను కేటాయించడంతో ఈ మొత్తం రూ.20,605.44 కోట్లకు చేరిందని వివరించారు. సబ్ ప్లాన్ నిధుల వినియోగంలో చాలా శాఖలు అంచనాలకు మించి ప్రగతిని సాధిస్తుండగా, మరికొన్ని శాఖలు మాత్రం వెనుకబడి ఉన్నాయని గుర్తించామన్నారు. 76 శాతం నుంచి 100 శాతం నిధులను వినియోగించిన శాఖలు ఏ-గ్రేడ్ గాను, 51 శాతం నుంచి 75 శాతం వరకు బీ-గ్రేడ్ గాను, 26 శాతం నుంచి 50 శాతం నిధులను వాడుకున్న శాఖలను సీ-గ్రేడ్ గాను, 25 శాతం వరకే నిధుల వినియోగం ఉన్న శాఖలను డీ-గ్రేడ్ గాను గుర్తించామని వివరించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మీ, సంచాలకులు కె.హర్షవర్ధన్, అదనపు సంచాలకులు రఘురామ్, ఉప సంచాలకులు లక్ష్మీ సుధతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### చంద్రబాబు హయాంలోనే దళితులపై దమనకాండ

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే దళితులపై అరాచకాలు, దమన కాండ కొనసాగిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. సమీక్ష అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులు అలో లక్ష్మణా... అంటూ కన్నీరుమున్నీరయ్యారని, ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులు, అఘాయిత్యాలు జరిగినప్పుడు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరిగి కేసులు పెట్టమని రోదిస్తే ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడు మహిళను కాలుతో తంతే ఎందుకు కేసు పెట్టలేదు..?, గరగపర్రులో దళితులు వెలివేత కేసు ఏం చేశారు..?, పెందుర్తిలో దళిత మహిళను వివస్త్రను చేసిన కేసుకు సంబంధించి పెందుర్తి పోలీసుస్టేషన్ ముందు ధర్నాకు దిగితే... ఆ కేసుల్ని ఏం చేశారు..?, వాటిని ఎందుకు అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు..? అని నిలదీశారు. ఈ ఘటనలపై ఈనాడులో వరుస కథనాలు ఎందుకు రాయలేదో... రామోజీరావు సమాధానం చెప్పాలంటూ నిలదీశారు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తప్పు చేసినందునే భయపడుతున్నట్లు ఉన్నారని అన్నారు.

## డిజిటల్ గ్రంథాలయాలకు శ్రీకారం

### గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో ఎక్కడా లేనంతగా డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.మందపాటి శేషగిరిరావు తెలిపారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ అధికారులతో పుస్తకాల కొనుగోలు, డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు, బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి పేదవానికి విద్య, విజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో విద్యాశాఖలో వివిధ సంస్కరణలు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయన ఆదేశాల మేరకు రూ.450 కోట్లతో 10,960 డిజిటల్ గ్రంథాలయాలకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడపలో మొదటి డిజిటల్ గ్రంథాలయం ఏర్పాట వుతుందని, పల్లె పల్లెకూ విజ్ఞాన వీచికలు అందాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏప్రిల్ 5 నుంచి విజనరీ జగన్ పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాడి బడ్జెట్‌లో గ్రంథాలయాల కోసం పుస్తకాల కొనుగోలుకు రూ.15.75 కోట్లు కేటాయించామని, ఇప్పటివరకు రూ.10 కోట్లతో పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలకు అందించామన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
ANDHRA PRADESH STATE BEVERAGES CORPORATION LIMITED
VIJAYAWADA, ANDHRA PRADESH
'e' Tender Notice
Tender Notice No. 30/APSBCL/Security/Depots/2023, dated 24.3.2023
Andhra Pradesh State Beverages Corporation Limited invites "Request for Proposals (RFP) for selection of an agency for providing security services round the clock at 29 IMFL depots of APSBCL for a period of one year on outsourcing basis through competitive e-tendering process under Reverse Tendering Mechanism which will provide the required number of security guards to its various retail outlets located in Andhra Pradesh" as per the terms and conditions laid down in the RFP Document.
All other information related to eligibility criteria, scope of work and terms and conditions, etc, are available on in the website of the Corporation i.e., www.apsbcl.ap.gov.in and also in www.tender.apeprocurement.gov.in
For any further clarifications, please contact:
Accounts Officer (Tenders),
Mail Id: apsbclco2122@gmail.com
Phone: 9030517221.
Address:
Andhra Pradesh State Beverages Corporation Limited (APSBCL),
88-2B, Kollafarum Road, SER Center, Prasadampadu, Vijayawada,
Andhra Pradesh 521108.

సంపాదకీయం

# సంక్షోభంలో ఇజ్రాయిల్

పలస్తీనియన్లను పూర్తిగా తుడిచి పెట్టడానికి సుప్రీంకోర్టును సంస్కరించాలన్న ఇజ్రాయిల్ మితవాద ప్రధాన మంత్రి నెతన్యాహూ ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆదివారం ఇజ్రాయిల్ అంతటా తీవ్ర నిరసన ప్రదర్శనలు జరిగాయి. దీనివల్ల దేశప్రజల్లో చీలికలు వస్తాయి కనక సుప్రీం కోర్టును సంస్కరించాలన్న ప్రతిపాదనను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నానని నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయిల్‌లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసమే జనం నిరసనకు దిగారు.

అయితే ఇజ్రాయిల్ ఇప్పటికీ ప్రజాస్వామ్య దేశం అని నమ్మేవారు ఎక్కువగానే ఉన్నారు. ఇజ్రాయిల్‌లో ఉన్న పలస్తీన పౌరుల విషయంలో వివక్ష దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. పలస్తీనియన్ల భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించింది. గాజా నది పశ్చిమతీరంలో, తూర్పు జెరూసలెంలో పలస్తీనియన్ల అణచివేత కొనసాగుతూనే ఉంది. పలస్తీనియన్ల ఉనికి దేశ జనాభా స్వరూపాన్ని మార్చివేస్తుంది అన్న విషప్రచారం మొదటి నుంచీ ఉంది. నెతన్యాహూ తలపెట్టిన సంస్కరణలకు వ్యతిరేకంగా దేశంలోకెల్లా పెద్ద కార్మికసంఘం ఈ నిరసన ప్రదర్శనలకు పిలుపు ఇచ్చింది. ఆదివారం ఇజ్రాయిల్ అంతటా సంపూర్ణమైన బంద్ జరిగింది. దుకాణాలు, బ్యాంకులే కాకుండా చివరకు ఆసుపత్రులు కూడా మూతపడ్డాయి. నెతన్యాహూ తలపెట్టిన సంస్కరణల ప్రధాన ఉద్దేశం న్యాయమూర్తులను నియమించే కమిటీపై పూర్తి ఆధిపత్యం సంపాదించడమే. ఈ విషయంలో మన దేశంలోని పరిస్థితికి ఇజ్రాయిల్‌లో స్థితిగతులకు సామ్యం కనిపిస్తోంది. నెతన్యాహూ అనుకున్న సంస్కరణలు కనక అమలులోకి వస్తే సుప్రీంకోర్టు తీర్పులను కూడా ఖాతరు చేయకుండా ఉండొచ్చు. ప్రధానమంత్రి ఆ పదవికి అర్హుడు కాడనీ నిర్ధారించడానికి వీలుండదు. అలాగే ప్రధానమంత్రిని పదవీచ్యుతుణ్ని చేయడం కూడా సాధ్యంకాదు. ఈ సంస్కరణల అంతరార్థం ఏమిటంటే తన మీద వచ్చిన అవినీతి ఆరోపణలపై సుప్రీం కోర్టు విచారణ జరపకుండా అడ్డుకోవడమే. నెతన్యాహూ మీద లంచ గొండితనం, మోసం, విశ్వాస ఘాతుకం లాంటి ఆరోపణలు ఉన్నాయి. తాను ఏ తప్పూ చేయలేదనీ తనను అనవసరంగా వేటాడుతున్నారని నెతన్యాహూ అందరు నియంతల్లాగే వాదిస్తున్నారు. నెతన్యాహూ మదిలో ఉన్న సంస్కరణలను శక్తిమంతమైన సైన్యంలోని కొన్ని వర్గాలతో పాటు సమాజంలోని అన్నివర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంస్కరణల ప్రతిపాదనను నెతన్యాహూ గత జనవరి నాలుగో తేదీన చేశారు. ముందుగా అనుకున్నట్టయితే ఈ ప్రక్రియ ఏప్రిల్ నాటికి పూర్తి కావాలి. సంస్కరణల ప్రతిపాదన వాయిదా వేయడంవల్ల నెతన్యాహూకు దక్కేదల్లా సంస్కరణల అమలును కాలయాపన చేయడమే. సంస్కరణల వల్ల ఏ సమస్యా పరిష్కారం కాకపోగా నెతన్యాహూ పట్టు మరింత బిగుస్తుంది. వాయిదా వేయడం కాదు ఈ ప్రతిపాదనే మానుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సంస్కరణలను వ్యతిరేకించిన రక్షణ మంత్రిని నెతన్యాహూ బర్తరఫ్ చేయడంకూడా పరిస్థితి సంక్షోభదశకు వెళ్లడానికి కారణం. అయితే నెతన్యాహూ ప్రతిపాదనను సమర్థించే వారు కూడా ప్రదర్శనలకు దిగారు. ఇజ్రాయిల్ పార్లమెంటు నెసెట్ వద్ద కూడా రెండుపక్షాల ప్రదర్శనలు కొనసాగాయి. పోలీసులు రెండు పక్షాలను విడదీయవలసి వచ్చింది. సుప్రీంకోర్టుకు కళ్లెం వేయాలన్న ప్రయత్నాలను ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ కూడా వ్యతిరేకించారు. నెతన్యాహూ కనక సంప్రదింపులకు సిద్ధపడితే ఈ సమస్య ఓ కొలిక్కి రావచ్చు. కానీ అది ఆయన తత్వం కాదు.

నెతన్యాహూ ప్రతిపాదన ప్రకారం సుప్రీంకోర్టు తీర్పులను తిరగ తోడడానికి సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇజ్రాయిల్ పార్లమెంటులో 120 మంది సభ్యులు ఉంటారు. అంటే 61 మంది సభ్యులు సమర్థిస్తే సుప్రీంకోర్టు ఏ నిర్ణయాన్ని అయినా ఖాతరు చేయకుండా ఉండొచ్చు. నిజానికి ఈ సంస్కరణల ప్రతిపాదన నెతన్యాహూది కాదు. ఇజ్రాయిల్ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షమైన లికుడ్ పార్టీ నాయకుడు, న్యాయశాఖ మంత్రి యారివ్ లెవిన్ సంస్కరణలకు పట్టుబడుతున్నారు. పార్లమెంటులోని శాసన, న్యాయ కమిటీ అధ్యక్షుడైన మతభావాలు మెండుగా ఉన్న జియానిస్టు నాయకుడు ఎం.కె. సించా రోతం కూడా సంస్కరణలకోసం ఆతృత కనబరుస్తున్నారు. ఈ ఇద్దరు నాయకులకు సుప్రీంకోర్టు అంటే చాలా కాలం నుంచే గిట్టదు. శరణార్థులు అన్నా సరిపడదు. ఈ శరణార్థులలో తీవ్రమైన మతతత్వం ఉన్న మిర్జాహీ వర్గానికి చెందినవారు ఉన్నారు. ఇజ్రాయిల్‌లోని మితవాదులు 2005లో గాజా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ వైదొలగాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసడిస్తూనే ఉన్నారు. 2019 నుంచి ఇజ్రాయిల్‌లో అయిదు సార్లు ఎన్నికలు జరిగాయి. నాలుగు సార్లు జరిగిన ఎన్నికలలో ఏ పక్షానికీ మెజారిటీ రాలేదు. కానీ గత నవంబర్‌లో జరిగిన ఎన్నికలలో నెతన్యాహూ నాయకత్వంలోని లికుడ్ పార్టీకి మెజారిటీ సమకూరింది. ఆ తరవాతే ఇజ్రాయిల్ చరిత్రలో ఎన్నడూ లేనంతటి మితవాదప్రభుత్వం ఏర్పడింది. గాజా నది పశ్చిమ తీరాన్ని సంపూర్ణంగా ఆక్రమించడం, స్వలింగ సంపర్కులకు హక్కులు కల్పించే అనుకూల చట్టాన్ని రద్దుచేయడం మొదలైనవి నెతన్యాహూ ఎజెండాలో ప్రధానాంశాలు. ఇజ్రాయిల్‌లో లాంఛనప్రాయమైన రాజ్యాంగం లేనందువల్ల రాజ్య వ్యవస్థలోని వివిధ అంగాల మధ్య సమతూకం కాపాడడానికి సుప్రీంకోర్టు చాలా కీలక పాత్ర పోషిస్తుంది. సంస్కరణలవల్ల ప్రజాస్వామ్య సూత్రాలు అంతరిస్తాయని, చట్టబద్ధ పాలన మాయమవుతుందన్న భయంవల్లే జనంలో వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉంది. ఈ నిరసనోద్యమానికి నిర్దిష్ట నాయకుడంటూ ఎవరూ లేరు. సైన్యంలోని ఒక వర్గంతో పాటు సాంకేతిక రంగంలోని వారు కూడా నెతన్యాహూ ప్రయత్నాలకు విముఖంగా ఉన్నారు. ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చే దేశాలు కూడా దేశం ఏ దారిలో వెళ్తుందోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామరస్యం కుదర్చడానికి ఇజ్రాయిల్ అధ్యక్షుడు చేసిన ప్రయత్నం విఫలమైంది. రక్షణ మంత్రి యోవ్ గలాంట్ ను బర్తరఫ్ చేసినందుకు కూడా వ్యతిరేకత మరింత పెరిగింది. నెతన్యాహూ రాజీ పడడానికి సిద్ధంగా ఉన్నాడని మీడియాలో వార్తలు వచ్చాయి. కానీ అత్యంత మితవాదుల ఒత్తిడి ఆయన మీద విపరీతంగా ఉన్నందువల్ల దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మితవాద పార్టీల మాట చెల్లకపోతే అవి ప్రభుత్వాన్ని పడదోసే అవకాశం కూడా ఉంది. అలా జరిగితే ప్రతిపక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి నెతన్యాహూ ప్రయత్నించినా చాలా ప్రతిపక్ష పార్టీలకు ఆయనమీద బొత్తిగా విశ్వాసం లేదు. అధికారపక్షం మంకుపట్టు పట్టి సంస్కరణలు తీసుకొస్తే ఇంతకు ముందు ఎన్నడూ లేని రాజ్యాంగ సంక్షోభం ఏర్పడవచ్చు. ఈ సంస్కరణలు అమలుచేస్తే వాటిని సుప్రీంకోర్టు ఏకమొత్తంగా కొట్టివేస్తే సంక్షోభం మరింత తీవ్రం కాక తప్పదు. ఈ సంస్కరణలే అమలులోకి వస్తే పలస్తీనియన్ల పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుంది. ఇంకో వేపు ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించే ఇరాన్ లాంటి దేశాలు ఈ పరిణామాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. ఇజ్రాయిల్ బలహీనపడడం కన్నా ఇరాన్ లాంటి దేశాలకు కావలసింది ఏమీ ఉండదు.

# చట్టసభల తీరు మారాలి

ఐ.ప్రసాదరావు

ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక చట్టసభలు. మనదేశ పరిధిలో పార్లమెంటు, వివిధరాష్ట్రాల్లో శాసనసభలు, శాసనమండళ్ల ప్రజల శ్రేయస్సు, అభివృద్ధికోసం అనేక చట్టాలుచేస్తూ ఉంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రెండుదశాబ్దాలకాలంలో పార్లమెంటు, శాసనసభలు గౌరవప్రదమైన రీతిలో లోతైనచర్చలు జరిపి చట్టాలు తయారుచేసేవారు. ముఖ్యంగా ప్రతి పక్ష నాయకులు సూచించే మంచిసలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని చట్టాలు పకడ్బందీగా తయారుచేసేవారు. తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్‌కూడా వివిధ అంశాల్లో ప్రతిపక్షపార్టీల నేతలు ఇచ్చే సూచనలు తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతంచేస్తుంది. అయితే, ఇటీవలికాలంలో పార్లమెంటు సమావేశాలు, వివిధ రాష్ట్రాల శాసనసభల సమావేశాల్లో తరచూ ఘర్షణ వాతావరణం, వాయిదాలపర్వం కొనసాగుతోంది. కొన్ని ముఖ్యమైన బిల్లులు కూడా సరైన చర్చలు లేకుండా చట్టాలుగా రూపుదిద్దుకుంటూ, తరువాత కోర్టులచుట్టూ ప్రదక్షిణలుచేసే పరిస్థితి. ఎందుకు వస్తుందని ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆలోచనచేయాలి. ఢిల్లీ, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాలు చేసిన చట్టాలను ఉద్దేశ్యపూర్వకంగా ఆయా గవర్నర్లు తొక్కిపెడుతూ ఇబ్బంది కలుగ చేస్తున్నారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో కూడా గవర్నర్లు తలదూరుస్తూ, కేంద్ర ప్రభుత్వ పరోక్ష సహకారంతో ముఖ్యమంత్రులను, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయా గవర్నర్లు ఇబ్బందులు పెడుతున్నారు. రాజ్యాంగం-కోర్టుల మధ్య వివాదాలు పేరుకుపోతూ, ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుంది. ఇక కొన్ని రాష్ట్రాల్లో (కేంద్రంలో కూడా) పాలకులు ప్రజాస్వామ్యంగా ఎన్నికైనా, పరిపాలనలో మాత్రం నియంతలుగా వ్యవహరిస్తూ, మనదేశ ప్రజాస్వామ్యవ్యవస్థకు పెను సవాల్‌గా మారారు.

ప్రస్తుతం మనదేశంలో జరిగే పార్లమెంట్ సమావేశాలకు సగటున ప్రతీ నిమిషానికి 2.5 లక్షల రూపాయలు ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. అనగా ప్రజలనుంచి పన్నులురూపంలో కొన్ని కోట్లరూపాయలు వసూలు చేస్తూ, ఆ రాబడిలో కొంతభాగం వివిధ రకాల మంచి చట్టాలు తయారుచేసే నిమిత్తం చట్టసభలు సమావేశమవుతాయి. అయితే, ఈ చట్టసభలు చేస్తున్న చట్టాలు ఎంత పటిష్ఠంగా, ఉపయోగపడే విధంగా వస్తున్నాయో...? మనం చూస్తూనేఉన్నాం. దాదాపు ఇటీవలవస్తున్న చట్టాలు అన్నీ తరచూ న్యాయ స్థానాల ముందుకు వస్తున్నాయి. అనేక లోపాలుతో, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా వస్తున్నాయి. చట్టసభల్లో సరైన చర్చలు లేకుండా మెజారిటీ ఉందని ఏకపక్షంగా చట్టాలుచేయడం ద్వారా సమస్యలు పెరుగుతున్నాయి. విద్యా విధానం-2020 చట్టమే తాజా ఉదాహరణ. కేవలం కేంద్ర కేబినెట్ ఆమోదంద్వారా విద్యాచట్టం చేయడం గమనార్హం...కేంద్ర ప్రభుత్వం చేసిన వ్యవసాయ చట్టాలు, ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని చట్టాలు తాజా ఉదాహరణ...

రాజ్యాంగ సూచనలు ప్రకారం, ప్రతీ సంవత్సరం పార్లమెంట్ 120 రోజులు, రాజ్యసభ 100 సిట్టింగ్‌లు జరగాలి. ప్రజలకు అవసరమైన మంచి చట్టాలు తయారు చేయాలి. చర్చలు జరగాలి. విపక్షాలు సూచనలు సలహాలు అవసరమైన సందర్భాల్లో పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా చట్టాలు తయారుచేయాలి. అయితే ఇటీవల కాలంలో తరచూ చట్టసభల్లో గందరగోళం, వాయిదాలు, అరుపులు, కేకలు, సభలను స్తంభింపచేయటంతో విలువైన సభాసమయం వృధా అవుతోంది. చాలాసార్లు కేంద్రం ఇందుకు కారణం అవుతోంది. అవగాహన లేనివారు, ఎదుటివారి చెప్పే విషయాలు వంటపట్టించుకోనివారు ఎక్కువగా చట్టసభల్లో అడుగుపెట్టడం జరుగుతోంది. దీంతో సరైన పద్ధతిలో చట్టాలు తయారు కావడంలేదు. మంచి చట్టాలు తయారు చేయడానికి, సమస్యలు పరిష్కారం చేయడానికి రాజ్యాంగం పార్లమెంట్‌కు అనేక సదుపాయాలు కలుగచేసింది. జీరో అవర్, లఘు ప్రశ్నలు, జవాబులు, ప్రశ్నోత్తరాల సమయం ఇలా అనేక సౌకర్యాలు ఇచ్చారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాప్రతినిధులు ఓరిమితో, అవగాహనతో చర్చలు చేయాలి. అప్పుడు మాత్రమే మంచి చట్టాలువస్తే ప్రజలకు, దేశాభివృద్ధికి ఉపయోగపడతాయి.

చట్టసభలద్వారా మంచిచట్టాలు రావాలంటే ఇకనైనా కొన్ని నియమా లను పాటించడం మంచిది. ప్రజాప్రతినిధులు అందరూ సరైన అవగాహన కలిగిఉండాలి. పరుష పదజాలం, విద్వేష ప్రసంగాలు చేయరాదు. సభా నియమాలు పాటించాలి. గౌరవప్రదమైన ప్రవర్తన కలిగిఉండాలి. విపక్షాలు సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకోవాలి. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించాలి. సమావేశాలకు డుమ్మా కొట్టరాదు. సమావేశాలను ఎడిట్ లేకుండా లైవ్ టెలికాస్ట్ చేయాలి. అప్పుడు మాత్రమే ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎలా ప్రవర్తిస్తున్నారో, ఏమి చేస్తున్నారో ప్రజలందరికీ ప్రత్యక్షంగా తెలుస్తుంది. బాధ్యతగా ఉంటారు. పారదర్శకత తెలుస్తుంది. మంచి ప్రవర్తన, విజ్ఞానం కలవారు ప్రజాప్రతి నిధులుగా ఎన్నిక కావడం కోసం పార్టీలు, ప్రజలు అవకాశం ఇవ్వాలి. అవినీతి, బంధుప్రీతికి లొంగరాదు. నీతి, నిజాయితీలకు పట్టం కట్టాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యవ్యవస్థకు మంచిభవిష్యత్తు ఇవ్వగలం. ముఖ్యంగా వయో జనులు, పౌరులు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి.... ఓటు ద్వారానే ప్రజల తమకలలను, భవిష్యత్తును తీర్చుదిద్దుకో గలరు. భారత రాజ్యాంగ ఆశయాలను అందుకోగలం.

సెల్: 9948272919

# ఖలిస్థాన్ ఉద్యమానికి ఊపిరిలూదుతున్నది ఎవరు?

"నేను భారతీయుడిని కాదు. భారతీయుడు అనే గుర్తింపు ఉండకూడదని నేను చెప్పడం లేదు. కానీ నాకు అది అవసరం లేదు. ఖలిస్థాన్ కోసం మేము చేస్తున్న పోరాటాన్ని చెడ్డదిగా చూడకూడదు. మేధోకోణంలో చూడాలి. సిక్కులు మొదట బ్రిటిష్ వారికి, ఇప్పుడు హిందువులకి బానిసలుగా ఉన్నారు." ఇవి వివాదాస్పద ఖలిస్థాన్ ఉద్యమకారుడు అమృత్‌పాల్ సింగ్ మాటలు. "నేను బింద్రన్ వాలే కాలిగోటికి కూడా సమానుణ్ని కాదు" అని కూడా ఆయన అన్నారు. 2023, ఫిబ్రవరి 23న పంజాబ్‌లోని అజ్నాలా పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి వారిస్ పంజాబ్దే (పంజాబ్ వారసులం) సంస్థకు చెందిన అమృత్ పాల్‌సింగ్ అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్ తుఫాన్‌ను విడుదల చేయాలని అమృత్‌పాల్ సింగ్ నాయకత్వంలో సిక్కులు కత్తులు, తుపాకులు, గురుగ్రంథ సాహిబ్ పుస్తకాలను చేతబట్టి దాడిచేశాడు. సాయుధులైన సిక్కుల బెదిరింపులకు తలొగ్గి పోలీసులు లవ్‌ప్రీత్ సింగ్‌ను విడుదల చేశారు. ఆ తరువాత గురుద్వారాలలో గొప్ప స్వాగతం పొందిన అమృత్‌పాల్ సింగ్ ఖలిస్థాన్ వేర్పాటువాద ఉద్యమానికి భవిష్యత్ నాయకునిగా గుర్తింపు పొందాలని చూస్తున్నారు. ఖలిస్థాన్ ఉద్యమం 2.0కు నాయకునిగా అమృత పాల్ ఆవిర్భావం వెనక ఉన్న శక్తులేవి? నిద్రాణంగాఉన్న ఈ ఉద్యమం మళ్లీ పురుడు పోసుకోవడానికి ఎవరు ఊపిరిలూదుతున్నారు? పంజాబ్‌లో ఖలిస్థాన్, కాంగ్రెసేతర తొలిపార్టీ ఆప్ అధికారంలోకి రావడం, కాంగ్రెస్, బీజేపీలు పంజాబ్‌లో అధికారంలోకి రావటంలో వైఫల్యం చెందటం, పాకిస్థాన్ దివాలా తీసిన సందర్భంలో ఐఎస్ఐ సంస్థ చురుకుగా మారటం, తదితర పరిస్థితుల నేపథ్యంలో ఎన్నో రాజకీయ, ఉగ్ర, కుట్ర కోణాలు ఈ ఉద్యమం వెనక ఉన్నాయా? అన్న ప్రశ్నలు నేడు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

భారత్‌లో పంజాబ్, పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో 25 నుండి 30 మిలియన్ల జనాభాతో ఉన్న సిక్కు మతం ప్రపంచంలో ఐదవ అతి పెద్ద మతం. గురునానక్ (1469-1539) స్థాపించిన సిక్కుమతం ఏకేశ్వరో పాసన, సర్వ మానవ సమానత్వం, నిజాయితీలను ప్రబోధించింది. హిందూ, ఇస్లాంల నుండి సిక్కుమతంలోకి మతం మార్పిడిలను నిరోధించడానికి మొఘల్ పాలకులతో ఘర్షణవల్ల గురు అర్జున్‌సింగ్, గురు తేజ్‌బహదూర్ ప్రాణాలు కోల్పోయారు. సిక్కు మతాన్ని అన్యమతాల నుండి కాపాడుకోవడం, సాధారణ ప్రజలను హింసనుండి రక్షించుకోవాలనే ఉద్దేశంతో సిక్కులను సంఘటితశక్తిగా 13.4.1699న సిక్కుల పదవ గురువు గురుగోవింద్ సింగ్ ఖల్సా (పవిత్రమైన)స్థాపించారు.

భారత్‌లోని పంజాబ్, పాకిస్థాన్లోని పంజాబ్లో నివసించే సిక్కు ప్రాంతాలను కలిపి లాహోర్ రాజధానిగా ఖలిస్థాన్(పవిత్ర భూమి) ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుండో సిక్కులలో ఉంది. సిక్కులకు ప్రత్యేకదేశం డిమాండ్ వెనక అనేక కారణాలు ఉన్నాయి. మహారాజా రంజిత్‌సింగ్ పాలనా కాలంలో చివరి సిక్కు సామ్రాజ్యం 1799 నుండి 1849 వరకు కొన సాగింది. రంజిత్ సింగ్ మరణం తర్వాత ఆంగ్లేయులు సిక్కులు నివసించే ప్రాంతాలను బ్రిటిష్ ఇండియా పంజాబ్ ప్రావిన్స్‌గా, స్వదేశీ సంస్థానాలుగా విభజించారు. బ్రిటిష్ వారు విభజించు-పాలించు సిద్ధాంతంలో భాగంగా హిందువులను, సిక్కులను వేరుచేసే ఉద్దేశంతో సిక్కులను సైన్యంలోకి ఎక్కువగా నియమించుకొని హిందువులను అణిచివేశారు. 1920, డిసెంబరు14న ఏర్పడిన అకాలీదళ్ పార్టీ సిక్కులు నివసించే ప్రాంతాలకు స్వతంత్ర ప్రతిపత్తి, సార్వభౌమాధికారం కావాలని డిమాండ్‌చేస్తూ వచ్చింది. 1929లో భారత జాతీయ కాంగ్రెస్ "పూర్ణ స్వరాజ్" కావాలని లాహోర్ సమావేశంలో తీర్మానం చేసినప్పుడు అంబేద్కర్, మహమ్మద్ ఆలీ జిన్నా, ధారాసింగ్ తదితరులు వ్యతిరేకించారు. పంజాబ్‌ను ముస్లిం రాష్ట్రంలో (పాకిస్థాన్‌లో) కలపాలని ముస్లింలీగ్ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ ఖలిస్థాన్‌కు బీజంవేసింది. హిందూ ముస్లింలకు దూరంగా సిక్కులకు ప్రత్యేక దేశం ఖలిస్థాన్‌ను ఏర్పాటు చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. 1947లో భారత్, పాకిస్థాన్‌లు వేరుపడినప్పుడు సిక్కులు నివసించే పంజాబ్ రెండుగా చీలిపోయింది. పాకిస్థాన్‌కువెళ్లిన పశ్చిమ పంజాబ్ తదితర ప్రాంతాల నుండి సిక్కులు భారత్‌లోని పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానాలకు అధిక సంఖ్యలో వలసవచ్చారు. దీనితో పాకిస్థాన్‌లోని సిక్కు జనాభా 19.8శాతం నుంచి 0.1శాతానికి తగ్గింది. 1966 సెప్టెంబరు నాటి పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం భాషా ప్రాతిపదికన సిక్కులు మాట్లాడే పంజాబీ భాషా ఆధారంగా సిక్కులు మెజారిటీగాగల పంజాబ్ రాష్ట్రం ఏర్పడింది. హిందువులు అధికంగా గల హర్యానా రాష్ట్రంతో పాటు కొండ ప్రాంతాలను హిమాచల్ ప్రదేశ్‌లో కలిపారు. చండీగఢ్‌ను పంజాబ్, హర్యానాలకు ఉమ్మడి రాజధానిగా, కేంద్రపాలిత ప్రాంతంగా చేశారు.

ఖలిస్థాన్ వేర్పాటు వాద ఉద్యమం 1978 నాటి జర్నేల్‌సింగ్ బింద్రన్‌వాలేకు, నిరంకారీ సిక్కుశాఖకు మధ్య జరిగిన ఘర్షణలతో ఊపందుకుంది. 1980 నుండి హిందూవ్యతిరేక హింసకు తెరలేపిన బింద్రన్‌వాలే వేలమంది సాయిధ అనుచరులను చేరదీశాడు. 1980-90 మధ్యకాలంలో బాంబులు, హత్యలు, కిడ్నాప్‌లు మొత్తంగా దాదాపు 22,000 మంది అశువులుబాసారు. పంజాబ్‌కేసరి పత్రిక ఎడిటర్ లాలాజగత్ నరేన్‌ను ఉద్యమకారులు హత్య చేశారు. 1982లో అకాలిదళ్‌తో కలిసి బింద్రన్‌వాలేపై ధర్మయుద్ధం ప్రకటించాడు. 1973 నాటి సిక్కుల ఆనందపూర్ సాహెబ్ తీర్మానాన్ని అమలు చేయాలని బింద్రన్‌వాలే డిమాండ్ చేశాడు. పంజాబ్‌కు ప్రత్యేక స్వయంప్రతిపత్తి ఇవ్వడం, కేంద్రం అధికారాలను రాష్ట్రాలకు బదలాయించడం, హిందూమతం నుండి సిక్కు మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించడం, తదితర డిమాండ్లు ఆనందపూర్ సాహెబ్ తీర్మానంలో ఉన్నాయి. నదీజలాలలో ఎక్కువ వాటా, చండీగఢ్‌ను పంజాబ్‌కు ఇవ్వడం వీరి ఇతర డిమాండ్లు. ప్రజల సాధారణ సమస్యలనుకూడా తీరుస్తూ చిరకాలంలోనే బింద్రన్‌వాలే పంజాబ్‌లో సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు.

1982లో తన మకాంను అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలోని హర్మిందిర్ సాహెబ్‌లోకి మార్చి తుపాకులు, బాంబులతో ఆలయంలో తిష్టవేశాడు. ఖలిస్థాన్ పేరుతో కరెన్సీని విడుదల చేయడమే గాక పాస్‌పోర్టులు జారీ చేశాడు. సిక్కుల అత్యంత విధాయక సంస్థ శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీపై ధ్వజమెత్తడం, బస్సులను హైజాక్‌చేసి సిక్కేతరులను చంపడం, ఖలిస్థాన్ వ్యతిరేకులను హతమార్చడం, పోలీసులు, అధికారుల, హత్యలు గోల్డెన్ టెంపుల్లోని ఎస్‌జీపీసీ కేంద్ర కార్యాలయం అకల్‌తక్త్‌ను కూల్చివేసి తుపాకులతో నింపడం వంటివి చేసిన బింద్రన్‌వాలే ఒక దశలో "ప్రతి సిక్కు 32 మంది శిక్కేతర్లను చంపాలి" అని పిలుపునిచ్చాడు. 1982 నుండి 84 మధ్యకాలంలో జరిగిన 1200 అల్లర్లలో 4100 మంది చనిపోయారు. 30 వేలమంది అరెస్టయ్యారు. అనేకసార్లు అరెస్ట్ అయినా రాజకీయపార్టీల మద్దతుతో విడుదలవుతూ వచ్చాడు. గోల్డెన్‌టెంపుల్ వేదికగాచేస్తున్న హింసకాండను అణిచివేయడానికి ఇందిరాగాంధీ ఆదేశంతో 1974 జూన్ 1 నుండి 8 వరకు నిర్వహించిన ఆపరేషన్ బ్లూస్టార్‌లో 83 మంది సైనికులు, 1000 మిలిటెంట్లు మృతిచెందారు. ఆ తర్వాత సైన్యంలోని సిక్కు రెజిమెంట్లలో సిక్కు సైనికులు తిరగబడటంతో 100మంది సైనికులు చనిపోయారు. వెయ్యిమంది అరెస్ట్ అయ్యారు. ఖలిస్థాన్ 2.0గా భావిస్తున్న తాజా సంఘటనల్లో సిక్కులను ఆకర్షిస్తున్న అమృత పాల్ సింగ్ సందు (30 సంవత్సరాలు) 12 పాసై దుబాయిలో కుటుంబ రవాణా ట్రక్కు డ్రైవర్‌గా పనిచేసి 2022లో భారత్‌కు తిరిగివచ్చి పంజాబ్‌లో తాజా దాడులు చేశాడు. అమృత్ (పవిత్ర జలం) ఇస్తూ ఖల్సాలోకి యువకులను ఆహ్వానించడం, ఘర్‌వాపసి(మతం మార్పిడి), డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంచేస్తున్న ఈయన ఖలిస్థాన్ ఏర్పాటు తన లక్ష్యమని ప్రకటిస్తున్నాడు. "తనను తాను కాపాడుకోలేని జీసస్ ప్రజలను ఎలా కాపాడుతాడు?" అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అమృతపాల్‌సింగ్ పరారీలో ఉన్నప్పటికీ ఖలిస్థాన్ ఉద్యమానికి వస్తున్న ప్రచారంచూస్తే ప్రజల్లో ఆకాంక్ష పూర్తిగా తగ్గలేదని చెప్పవచ్చు.

తండ ప్రభాకర్ గౌడ్, 9491822383

# పోలవరం గుట్టు విప్పని కేంద్రమంత్రులు

వి. శంకరయ్య

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి లోక్‌సభలో ఒక రకంగానూ రాజ్యసభలో మరోరకంగా కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రులు విరుద్ధమైన ప్రకటన చేశారనే చర్చ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇద్దరు సహాయ మంత్రులు చేసిన ప్రకటనల్లో కూడా అసలు రహస్యం దాచి పెట్టారు. అయితే రాజ్యసభలో మాత్రం కేంద్రమంత్రి వ్యయం పెరగడానికి వక్రభాష్యం చెప్పి అసలు వాస్తవం దాచి పెట్టారు. ప్రాజెక్టు వ్యయం పెరగడానికి భూసేకరణ పరిహారం పునరావాసం వ్యయం పెరగడంగా చెప్పి వాస్తవం వెల్లడించలేదు. 2020లో సమావేశమైన సవరణల వ్యయం అంచనాల కమిటీ రెండో డిపిఆర్ ఎందుకు ఆమోదించిందనే ప్రశ్నకు ఇద్దరు మంత్రుల్లో సమాధానంలేదు? ఇక్కడే అసలు రహస్యం దాగివుంది. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసీ దాచి పెడుతోంది.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే 2019 ఫిబ్రవరి నెలలో సాంకేతిక సలహా మండలి సమావేశమై 2017-18 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం రెండవ డిపిఆర్ అంచనా వ్యయం 55,548 కోట్లుగా ఆమోదించినది. తదుపరి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ అధికారంలోనికి వచ్చింది. వచ్చీ రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కన్నా ముందుగా అందులో అవినీతి వెతకడం కాంట్రాక్టరు మార్పుతో కాలం గడిపింది. కాంట్రాక్టరు మార్పు వద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తిరిగి 2020 లో గాని పోలవరం ప్రాజెక్టు గురించి కేంద్ర జల శక్తిశాఖ పట్టించుకోలేదు. 2020లో సమావేశమైన సవరణల వ్యయం అంచనాల కమిటీ రెండు డిపిఆర్‌లు ఎందుకు ఆమోదిం చిందనే అంశానికి లోక్‌సభ, రాజ్యసభల్లో మంత్రులు చేసిన ప్రకటనల్లో కాగడాపెట్టి వెతికినా సమాధానం లభించదు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జ్ఞాపకశక్తి వుండదని భావిస్తున్నారేమో?

2020 లో సమావేశమైన సవరణల వ్యయం అంచనాల కమిటీ 2019 లో కేంద్రమంత్రివర్గం ఆమోదం చూపెట్టి 2013-14 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం ప్రాజెక్టు వ్యయం 29,027.95 కోట్లని, ఇందులో సాగునీటి వ్యయం 20,027.95 కోట్ల రూపాయల అంచనా వేసింది. ఎందుకిలా జరగిందనేందుకు కేంద్రమంత్రివర్గం 2017లో చేసిన తీర్మానం చూపెట్టింది. అంటే కేంద్ర ప్రభుత్వం 2013-14 నాటి షెడ్యూల్ రేట్లకే కట్టుబడి వున్నట్లు భావించాలి. అదే సమయంలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే 2017-18 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం గతంలో సాంకేతిక సలహా మండలి ఆమోదించిన అంచనాను సవరించి 47,725.25 కోట్లు చాలని ఇందులో సాగునీటి వ్యయానికి 35,950.16 కోట్ల రూపాయల అవసరమని రెండు అంచనాలను కేంద్ర ఆర్థికశాఖకు సమర్పించింది. ఇందులో కీలకమైన రెండు అంశాలు ఇమిడి వున్నాయి.

ఒకే సమయంలో సవరణల వ్యయం కమిటీ రెండో డిపిఆర్ ఎందుకు రూపొందించింది? ఈ అంశంపై కేంద్ర మంత్రులు నోరు విప్పలేదు. కాగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన సమయంలో 2010-11 నాటి షెడ్యూల్ రేట్ల ప్రకారం తొలి డిపిఆర్‌ను 16,010.47 కోట్లు గానూ, ఇందులో సాగునీటి వ్యయం 9,307.34 కోట్ల రూపాయలుగా ప్లానింగ్ కమిషన్ ఆమోదించిన దరిమిలా పైగా చట్టబద్ధతగల జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత కూడా రెండవ డిపిఆర్ కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఆమోదించలేదు? ఇందుకూ సమాధానం లేదు. రెండు చట్టసభల్లో కేంద్ర మంత్రులు ఇచ్చిన సమాచారంలో రెండవ డిపిఆర్ గురించి ప్రస్తావించ లేదు?

వాస్తవంలో సవరణల వ్యయం అంచనాల కమిటీ ఆమోదించిన 2013-14 నాటి అంచనాల మేరకే ప్రస్తుతం కేంద్ర ఆర్థికశాఖ బిల్లులు చెల్లించుతోంది. అందుకు పెచ్చువున్న బిల్లులను చెల్లించకుండా తిరిగి పంపిన సందర్భాలున్నాయి. ఈ కుట్రలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పాలు పంచుకొంటున్నదనేందుకు ఇంత కన్నా మరొక తార్కాణం అవసరం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాన మంత్రిని కలిసినప్పుడు ప్రస్తుతం 15 కోట్ల రూపాయల (గతంలో పది వేల కోట్ల రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది) రూపాయలు అడ్వాన్స్‌గా అడిగానని ప్రకటన చేశారు. గాని ప్రాజెక్టు ఎన్నిదశలుగా నిర్మించినా ముందుగా రెండవ డిపిఆర్ ఆమోదం అడిగినట్లు చెప్పలేదు. ఇప్పుడే కాదు. గతంలో కూడా రాష్ట్రప్రభుత్వం నుండి ఇలాంటి విజ్ఞప్తి చేసిన దాఖలా లేదు. కేంద్ర మంత్రులు కూడా రెండవ డిపిఆర్ గురించి మాట మాత్రంగా ప్రస్తావించ లేదు. ప్రాజెక్టు వ్యయం పెరగడానికి భూసేకరణ పునరావాసం నష్ట పరిహారం గురించి చెబుతారే గాని 2020 లో సమావేశమైన సవరణల వ్యయం అంచనాల కమిటీ ఒకే రోజు వివిధ షెడ్యూల్ రేట్లతో వేసిన అంచనా ఎందుకు వేసిందో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుండి పల్లెత్తు మాట రావడం లేదు.

వాస్తవంలో ఈ రోజుకూ కేంద్ర ప్రభుత్వం 2013-14 నాటి షెడ్యూల్ రేట్లకే కట్టుబడి వుంది. ఈ పాటికే దాదాపు 13 వేల కోట్ల రూపాయల ఇచ్చినందున మరొక పదివేల కోట్లరూపాయల ఇచ్చి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 41.15 (135 అడుగులు) కే ఎన్నికలలోపు మమ అనిపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడబల్కుని ఈ దుష్ట పన్నాగానికి తెరలేపారు. ఇంకా చెప్పాలంటే కేంద్ర మంత్రుల సమాధానాల్లో పెద్ద తేడా లేదు. కాకుంటే పోలవరంప్రాజెక్టు ఎత్తుకు గల చట్టబద్ధత ఒక మంత్రి వెల్లడించారు.

పోలవరం నీటి నిల్వ సామర్థ్యం తగ్గించగలరేగాని ప్రాజెక్టు ఎత్తునిర్మాణం తగ్గించలేరు. ఈ పాటికే స్పిల్ వే 150 అడుగుల ఎత్తుతో నిర్మాణం జరిగినందున నదీ గర్భంలో డయాఫ్రమ్ వాల్ గాని రాక్‌ఫిల్ డ్యామ్ గాని ఎత్తుతగ్గించడం కుదరదు. ఈ అంశాన్ని కేంద్ర జల సంఘం ఈపాటికే స్పష్టత ఇచ్చింది. ఈ అంశంలో పోలవరం ప్రాజెక్టుకు దేవుడు స్క్రిప్టు బాగా రాశారు.

పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్లకు పరిమితంచేస్తే డెడ్ స్టోరేజ్ 119 టియంసిలు మాత్రమే మిగులుతాయి. లైవ్ స్టోరేజ్ 75 టియంసిలు గురించి మరిచి పోవాలి. కుడి ఎడమ కాలువల్లో గ్రావెటి ద్వారా నీళ్లు పారవు. ఇదే జరిగితే ఉత్తరాంధ్రలో రాజధాని పెట్టి ఉద్ధరిస్తామంటున్న వైసిపి నేతలు ఉత్తరాంధ్రకు జీవనాడి అయిన సుజల ప్రవంతి గురించి ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? పైగా ఎంతో ప్రతిష్టాత్మకంగా పల్నాటి ప్రాంతానికి చేపట్టిన వైయస్సార్ ఎత్తిపోతలు అటకెక్కుతుంది. రాయలసీమ గురించి చెప్పే పనిలేదు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహంలో పాలుపంచు కొని అది చెప్పే అన్నింటికి జగన్మోహన్ రెడ్డి తలూపితే తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న వారౌతారు. ఈ లొంగుబాటు ఈనాటిది కాదు. 2020 లోనే జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు గురించి చెబుతూ డ్యాం సేఫ్టీఅండ్ స్టెబిలిటీ ప్రొటోకోల్ సిద్ధాంతం చెప్పి వున్నారు.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

విశాలాంధ్ర



# పార్లమెంట్‌లో అదే తీరు

- ఆగని అదానీ ప్రకంపనలు
- సాగని కార్యకలాపాలు
- నల్ల వస్త్రాల్లో విపక్షాల ఆందోళన
- వెల్‌లో నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శన
- లోక్‌సభలో సభాపతిపైకి కాగితాలు, స్కాఫ్ విసిరిన ఎంపీలు

**న్యూదిల్లీ:** చట్టసభల్లో అదానీ ప్రకంపనలు ఆగలేదు. ప్రతిపక్ష సభ్యులు నల్ల వస్త్రాల్లో సభలకు హాజరై ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి. మంగళవారం ఉదయం తొలి వాయిదా అనంతరం మధ్యాహ్నం 2గంటలకు లోక్‌సభ తిరిగి సమావేశమైంది. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి, అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ కోసం డిమాండ్ చేశారు. నల్లవస్త్రాల్లో సభకు హాజరైన వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి' అన్న ప్లకార్డుల ప్రదర్శించారు. గందరగోళం నడుమ సభలో పత్రాలు, నివేదికల సమర్పణ జరిగింది. సభ కార్యకలాపాలు సజావుగా సాగలేని పరిస్థితుల్లో లోక్‌సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి రమాదేవి ప్రకటించారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయం వాషౌట్ అయింది. నిమిషం లోపే వాయిదా పడింది. ఆదేశాల పత్రాలను చించి, సభాపతి వైపునకు కాంగ్రెస్ సభ్యులు ఎస్.జోతిమణి, రమ్యహరిదాస్ విసిరారు. మరొక కాంగ్రెస్ నేత టీఎన్ ప్రతాపన్ నల్లస్కాఫ్ విసరగా మార్షల్స్ పట్టుకున్నారు. సభాపతిగా ఉన్న పీవీ మిథున్ రెడ్డి సభ్యులను అదుపు చేసేందుకు విఫల ప్రయత్నం చేశారు. గందరగోళం నడుమ మధ్యాహ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేశారు. పార్లమెంటులో బడ్జెట్ రెండవ విడత సమావేశాలు మొదలైనప్పటి నుంచి చట్టసభలు రసాభాస అవుతూనే ఉన్నాయి. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యం ఆవిష్కృతమైంది. చైర్మన్ ధన్కర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. తొలుత ఉదయం వాయిదా తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైనప్పుడు సభలో బిల్లులపై చర్చ జరపాలని ధన్కర్ తెలిపారు. కానీ నల్ల వస్త్రాలలో సభకొచ్చిన ప్రతిపక్షాల ఎంపీలు ఆందోళన కొనసాగించారు. 'మోదీ-అదానీ భాయి భాయి' నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి వెళ్లగా మిగతా నేతలు నిలుచొని ఆందోళన చేశారు. పౌరవిమానయాన పరిశ్రమకు నికర నష్టంపై స్టార్డ్ ప్రశ్నకు జ్యోతిరాదిత్య సింధియా తరపున కేంద్రమంత్రి వీకే సింగ్ సమాధానం ఇచ్చాక ధన్కర్ సభను వాయిదా వేశారు. అంతకుముందు కేంద్రమంత్రిహర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతుండగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని విపక్షాల సభ్యులు డిమాండ్ చేశారు.

రాజ్యాంగం (ఎస్టీ) ఆదేశాల (ఐదవ సవరణ) బిల్లు, 2022, రాజ్యాంగం (ఎస్టీ) ఆదేశాల (మూడో సవరణ) బిల్లు, 2022 సభలో లిస్టింగ్ చేయగా వాటిపై చర్చ జరగలేదు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గోహైన్, తీను ఘన్‌గస్, స్వీటీ బూరాకు సభ శుభాకాంక్షలు తెలిపింది. మహిళా శక్తికి ఇది నిదర్శనమని ధన్కర్ అన్నారు.

## అమృత్‌పాల్‌ను త్వరలో పట్టుకుంటాం...

### హైకోర్టుకు తెలిపిన పంజాబ్ ప్రభుత్వం

**చండీగఢ్:** ఖలిస్తానీ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్‌ను త్వరలోనే పట్టుకుంటామని రాష్ట్ర హైకోర్టుకు పంజాబ్ ప్రభుత్వం తెలిపింది. అమృత్‌పాల్ కోసం అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. అమృత్‌పాల్ సింగ్ పోలీసుల అక్రమ కస్టడీలో ఉన్నట్లు న్యాయవాది ఇమాన్ సింగ్ ఖారా దాఖలు చేసిన హేబియోకార్పస్ పిటిషన్‌ను పంజాబ్, హరియాణా హైకోర్టు మంగళవారం విచారించింది. పంజాబ్ అడ్వకేట్ జనరల్ వినోద్ ఘాయ్ వాదనలు వినిపిస్తూ ఇప్పటివరకు అమృత్‌పాల్ సింగ్ పట్టుబడలేదని చెప్పారు. అతనిని పట్టుకునేందుకు అనేక సంస్థలతో సమన్వయం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం విలేకరులతో పిటిషనర్ మాట్లాడుతూ అమృత్‌పాల్ సింగ్‌ను త్వరలోనే పట్టుకోబోతున్నట్లు కోర్టుకు అడ్వకేట్ జనరల్ తెలిపారని అన్నారు. జస్టిస్ ఏఎస్ షెఖావత్ కేసును విచారిస్తూ అమృత్‌పాల్ సింగ్ పోలీసు కస్టడీలో ఉన్నట్లు రుజువు చేసే విధంగా అఫిడవిట్ సమర్పించాలని పిటిషనర్‌కు సూచించారు. తమ వాదనకు బలం చేకూర్చే విధంగా రుజువులు తేగలిగితే వారెంట్ అధికారిని నియమిస్తామని చెప్పి, విచారణను బుధవారానికి వాయిదా వేశారు. కాగా ఈనెల 18 నుంచి అమృత్‌పాల్ పరారీలో ఉండగా అతని సహచరులు అనేకమందిని పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం విదితమే. మరోవైపు దేశవిద్రోహ చర్యలతో సంబంధం లేని వారిని ముందస్తు కస్టడీ నుంచి విడుదల చేయాలని డీజీపీకి సీఎం భగవంత్ మాన్ సూచనలు చేశారు. రాష్ట్ర శాంతిని భగ్నం చేసేందుకు యత్నించిన వారిని ఉపేక్షించేది లేదని అయనన్నారు.

## కర్ణాటకలో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు జైలుశిక్ష

## నెల దాటినా పడని అనర్హత వేటు

**బెంగళూరు:** పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పార్లమెంటు సెక్రటేరియట్ ఆగమేఘాలమీద రద్దుచేసింది. కానీ, కర్ణాటకలో జైలు శిక్ష పడిన ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేల విషయంలో మాత్రం అక్కడి అసెంబ్లీ అధికారులు చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. రాహుల్‌గాంధీకి సూరత్ న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించిన మరుసటి రోజే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. కర్ణాటకలో ఇద్దరు ఎమ్మెల్యేలకు కోర్టులు శిక్ష విధించి రెండు నెలలు అవుతున్నా ఇప్పటివరకూ వారి సభ్యత్వాలు రద్దు కాలేదు. పైపెచ్చు వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీకి వారు సన్నాహాలు చేసుకొంటున్నారు. హావేరీ పట్టణంలో అభివృద్ధి పనుల అమల్లో అవినీతికి పాల్పడిన నేరానికి హావేరీ బీజేపీ ఎమ్మెల్యే నెహ్రూ ఓలేకర్, ఆయన కుమారులు మంజునాథ్ ఓలేకర్, దేవరాజ్ ఓలేకర్‌కు న్యాయమూర్తి జయంత్‌కుమార్ గత నెల 13న రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు. హావేరీ పట్టణంలో కాంక్రీట్ రహదార్ల నిర్మాణం, ఇతర పనుల కాంట్రాక్టును ఓలేకర్ తన కుమారులకే ఇప్పించి రూ.50 లక్షల మేరకు అవినీతికి పాల్పడినట్టు నేరం రుజువైంది. నెహ్రూ ఓలేకర్‌కు బెయిల్ మంజూరు చేశారు. చెక్ బౌన్స్ కేసులో చిక్‌మగళూరు జిల్లా మూడిగెరె బీజేపీ ఎమ్మెల్యే ఎంపీ కుమారస్వామికి అక్కడి ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. హెచ్‌ఆర్ హూవప్ప గౌడ అనే వ్యక్తి నుంచి కుమారస్వామి రూ.1,38,65,000 కోట్ల రుణం తీసుకొని చెల్లని చెక్కులు ఇచ్చినందుకు న్యాయమూర్తి జీ ప్రీత్ గత నెల 13న నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు కుమారస్వామి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వీరి సభ్యత్వ రద్దుపై కర్ణాటక అసెంబ్లీ అధికారులు నోరు మెదుపటం లేదు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే ఉద్యమం: మాకెన్



**జమ్ము:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, అవినీతిని ఎత్తిచూపేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిందని సీనియర్ నేత అజయ్ మాకెన్ అన్నారు. మంగళవారం ఇక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలన్న పార్టీ డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు. 'పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీ, అదానీ మధ్య సంబంధాలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తిన రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు దారితీసిన సంఘటనల క్రమాన్ని చూడండి... సమాధానాలు పొందడానికి బదులుగా, అతను అనర్హుడిగా ప్రకటించబడ్డాడు... దానిని మనం ప్రజాస్వామ్య బద్ధ అనర్హతగా చూస్తామా?' అని ప్రశ్నించారు. 'మా పోరాటం రాహుల్ కోసం కాదు, ఇది దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఉద్దేశించబడింది. అవినీతిని బహిర్గతం చేయడానికి, క్రోనీ క్యాపిటలిజం బాధితులుగా మారుతున్న సామాన్య పౌరుల ప్రయోజనాలను కాపాడటానికి మేము మా నిరసనను కొనసాగిస్తాం' అని మాకెన్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ అధికారం కోసం కాదు... దేశంలోని ప్రజాస్వామ్య సంస్థలను, దాని ప్రజలను రక్షించడానికి పోరాడుతున్నారని తెలిపారు. అదానీ అంశంపై జేపీసీ విచారణ జరిపించాలన్న ప్రతిపక్షాల ఉమ్మడి డిమాండ్‌ను ఇప్పటికైనా ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. జేపీసీలో అత్యధిక సంఖ్యలో బీజేపీకి చెందిన సభ్యులే ఉంటారని, అయినా వారు జేపీసీ ఏర్పాటుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. 'మోదీ-అదానీ మధ్య సంబంధాన్ని బహిర్గతం చేయడానికి మరియు జాతీయ భద్రతతో నేరుగా ముడిపడి ఉన్న షెల్ కంపెనీలను గుర్తించడానికి జేపీసీ తప్పనిసరి, ఎందుకంటే ఈ కంపెనీలకు చైనా, పాకిస్తాన్ నుంచి నేరుగా మద్దతు లభించే అవకాశం ఉంది' అని మాకెన్ అన్నారు.

## అన్నాడీఎంకే అధినేత పళనిస్వామే

### హైకోర్టులో పన్నీరుసెల్వం పిటిషన్ కొట్టివేత

**చెన్నై:** అన్నాడీఎంకే పార్టీ పగ్గాలను మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను పార్టీ నుంచి బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన కొద్దిసేపటికే.. పళని ఎన్నికపై అధికారిక ప్రకటన వెలువడింది. అన్నాడీఎంకేలో ద్వంద్వ నాయకత్వాన్ని రద్దు చేసి.. పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాన కార్యదర్శి పదవికి మార్చి 26న ఎన్నికలు నిర్వహించారు. ఈ పదవికి పళని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. అధినాయకత్వ పోరులో కోర్టుకెళ్లిన పన్నీర్ సెల్వం పిటిషన్‌ను కొట్టేసిన కొద్దిసేపటికే పార్టీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆధిపత్య పోరులో వరుస ఎదురుదెబ్బలు ఎదుర్కొంటున్న పన్నీర్‌సెల్వం...మరోసారి మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తనను పార్టీ నుంచి బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎన్నికను రద్దు చేయాలని పన్నీర్ మద్దతుదారులు పిటిషన్ వేశారు. అయితే, ఈ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో పళని ఎన్నికకు మార్గం సుగమమైంది. కాగా, అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణించాక పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవిని రద్దు చేశారు. నాటి నుంచి పన్నీర్ సెల్వం సమన్వయకర్తగా, పళనిస్వామి సంయుక్త సమన్వయకర్తగా కొనసాగారు. అయితే, ద్వంద్వ నాయకత్వంతో నిర్ణయాలు తీసుకోవడం సమస్యాత్మకంగా మారిందని, పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయంపై జిల్లా కార్యదర్శుల సమావేశం నిర్వహించి చర్చించారు. దానిలో పళని వర్గం ఏకనాయకత్వ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఇందుకు పన్నీర్ వర్గీయులు అంగీకరించలేదు. దీంతో 2022 జూన్ 23న సర్వసభ్య సమావేశం నిర్వహించగా రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ తర్వాత జులై 11న మరోసారి సమావేశం నిర్వహించారు. అందులో పార్టీలో ద్వంద్వ నాయకత్వాన్ని రద్దు చేస్తూ ప్రతిపాదించిన తీర్మానానికి ఆమోదం తెలిపారు. కొత్తగా ఉప ప్రధాన కార్యదర్శి పదవిని తీసుకొచ్చారు. అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని ఎన్నుకున్నారు. దీనిపై పన్నీర్ సెల్వం.. మద్రాసు హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లభించలేదు. పళని ఎన్నికను న్యాయస్థానాలు సమర్థించాయి. కోర్టు తీర్పులు వెలువడటంతో ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నికలు నిర్వహించి... పూర్తిస్థాయి అధినాయకుడిగా పళనిస్వామిని ఎన్నుకున్నారు.

## దేశంలో 1317 హెచ్3ఎన్2 కేసులు

**న్యూదిల్లీ:** దేశంలో జనవరి 1 నుంచి మార్చి 21 వరకు 1,317 హెచ్3ఎన్ 2 (ఇన్‌ఫ్లుయెంజా) కేసులు నమోదయ్యాయి. ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ మంగళవారం రాజ్యసభకు ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ మేరకు సమాచారం అందించాయని పేర్కొన్నారు. కాగా భారతీయ వైద్య పరిశోధక మండలి (ఐసీఎంఆర్) సమాచారం ప్రకారం... గత రెండు నెలల్లో ఐఎల్ఐ/ఎస్ఏఆర్ఐ నిఘా ప్రకారం... 510 హెచ్3ఎన్2 కేసులు నమోదవగా, ఇందులో 19 మంది రోగులను ఐసీయూలో ఉంచి చికిత్స అందించవలసి వచ్చిందని పవార్ రాతపూర్వక సమాధానంలో తెలిపారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, హెచ్3ఎన్2తో సహా ఇన్‌ఫ్లుయెంజా కేసుల నిర్వహణకు రాష్ట్రాలకు మద్దతుగా అనేక చర్యలు తీసుకున్నామని పవార్ తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు తమ తమ ప్రాంతాలలో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించినట్లు పేర్కొన్నారు.

# మీరే చేశారు... కాదు మీరే

- కర్ణాటక కోటా పోరులో హింసపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం నిందలు
- యెడియూరప్ప ఇంటిపై దాడిలో 'రాజకీయం': డీకే, బొమ్మై ఆరోపణలు

**బెంగళూరు/ కాల్బుర్గి:** విద్య, ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను వర్గీకరించాలని కర్ణాటకలోని బొమ్మై అధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ వర్గాలకు కేటాయించిన 17శాతం రిజర్వేషన్లను ఉప వర్గాల వారీగా విభజించాలని కేబినెట్ ఇటీవల సూచించింది. ఈ ప్రతిపాదన బంజారా వర్గీయులకు కోపం తెప్పించింది. దీంతో శివమొగ్గ జిల్లాలో శిఖరిపురాలో కోటా పోరు రగిలింది. సోమవారం వేలాది సంఖ్యలో బంజారా ప్రజలు ఆందోళకు దిగారు. మాజీ సీఎం, శిఖరిపుర ఎమ్మెల్యే బి.యెడియూరప్ప ఇంటి పై రాళ్లదాడి చేశారు. ఇందులో ఆయన ఇంటి కిటీకీ అద్దాలు ధ్వంసమయ్యాయి. అలాగే నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. ఇప్పుడు ఇదే వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించింది. కాంగ్రెస్ వరే బంజారా వర్గీయులను రెచ్చగొట్టినట్లు బీజేపీ ఆరోపిస్తుంటే యెడియూరప్పను రాజకీయాలకు శాశ్వతంగా దూరం చేసే ఉద్దేశంతోనే అంతర్గత రాజకీయాలతో కమలం పార్టీ ఈ దాడికి ఉసగొలిపిందంటూ కాంగ్రెస్ ఆరోపించింది. ఇరు వర్గాల నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ బీజేపీలో అంతర్గత 'రాజకీయ' కుట్ర క్రమంలో యెడియూరప్ప ఇంటిపై రాళ్లదాడి జరిగిందని అన్నారు. అయితే డీకే ఆరోపణలను సీఎం బసవరాజ్ బొమ్మై తోసిపుచ్చారు. ఇదంతా కాంగ్రెస్ వ్యూహమేనని తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెప్పారు. 'శికుమార్ చెప్పేదేమిటి? ఇది కాంగ్రెస్ పని. స్థానికంగా పట్టుబడినది కాంగ్రెస్ వర్గీయులే. దీనిపై డీకే శివకుమార్ ఏం చెబుతారు? అని బొమ్మై ప్రశ్నించారు. 'కాంగ్రెస్ నేతలు కెమెరాకు చిక్కారు. అమాయక బంజారా వర్గీయులను ఎస్సీ జాబితాలో నుంచి తొలగిస్తారని చెప్పి రెచ్చగొట్టింది కాంగ్రెస్ వారే. గతరాత్రి సమావేశం తర్వాత ఇదంతా చేశారన్న రుజువులు ఉన్నాయి' అని సీఎం అన్నారు. డీకే స్పందిస్తూ 'బీజేపీ అంతర్గత రాజకీయాల్లో భాగంగానే యెడియూరప్ప ఇంటిపై రాళ్లదాడి జరిగింది. యెడియూరప్ప ముఖ్యమంత్రి కాదు.. ఆయన ప్రభుత్వంలో భాగంగా లేరు. ముఖ్యమంత్రి బొమ్మై రిజర్వేషన్ అంశంలో గందరగోళం సృష్టించారు. ఇప్పుడు ఆయనను కేంద్రబిందువుగా నిలిపేందుకు బీజేపీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా యత్నిస్తున్నారు. ఓ విధంగా యెడియూరప్పను నిర్లక్ష్యంగా చేస్తున్నట్లు షా అంగీకరించారు. అందుకోసమే ఆయన ఉదయం అల్పాహారం కోసం యెడియూరప్ప ఇంటికి వెళ్లారు. అంతర్గత రాజకీయాల క్రమంలో యెడియూరప్పను పక్కకు పెట్టేసే కుట్రలు బీజేపీలో జరుగుతున్నాయి. సీఎం ఇంటిపై లేక అధికారంలో ఉన్న వారి ఇళ్లపై రాళ్లదాడి జరిగివుంటే పరిస్థితి వేరేగా ఉండేది' అని అన్నారు. రాష్ట్ర హోంమంత్రి అరగా జ్ఞానేంద్ర స్పందిస్తూ 'శిఖరిపురాలో జరిగినది దురదృష్టకరం. చెప్పుడు మాటలు విని రెచ్చిపోయిన కొందరు ఈ దాడికి పాల్పడ్డారు. అమాయకులు ఇలాంటివి చేస్తారని ఎవరూ అనుకోరు. రాజకీయ దురుద్దేశంతో కొందరు దాడికి ఉసగొలిపినట్లు సమాచారం ఉంది. దీనిపై దర్యాప్తు జరుగుతోంది' అని అన్నారు. రాళ్లురువ్విన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని యెడియూరప్ప కోరినట్లు చెప్పారు. గాయపడిన ఇద్దరు, మగ్గురు పోలీసులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అల్లర్లు సృష్టించారని, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారని హోంమంత్రి వెల్లడించారు.

## సంస్కృతం అధికారిక భాష కాదు...

**న్యూదిల్లీ:** హిందీతో పాటు సంస్కృతాన్ని అధికారిక భాషగా చేసేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదనలు తమ పరిశీలనలో లేవని కేంద్రప్రభుత్వం మంగళవారం లోక్‌సభకు తెలిపింది. ఈమేరకు బీజేపీ సభ్యుడు సుబ్రత్ పాఠక్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అజయ్ కుమార్ మిశ్రా రాతపూర్వకంగా బుదలిచ్చారు. 'లేదు సర్. సంస్కృతాన్ని అధికారిక భాషగా చేసేందుకు ప్రభుత్వ పరిశీలనకు ఎలాంటి ప్రతిపాదన రాలేదు. రాజ్యాంగంలోని అధికరణ 343(1) ప్రకారం దేవనాగిరి లిపిలోని హిందీయే కేంద్రప్రభుత్వ అధికారిక భాషగా ఉంది' అని మిశ్రా పేర్కొన్నారు.

## మహిళా బాక్సర్లను అభినందించిన రాజ్యసభ

**న్యూదిల్లీ :** ఇటీవల జరిగిన మహిళల బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించినందుకు నిఖత్ జరీన్, లోవ్లినా బోర్గోహైన్, నీతూ ఘంఘాస్, సావీటీ బూరాను రాజ్యసభ మంగళవారం అభినందించింది. మంగళవారం సభ సమావేశమైనప్పుడు చైర్మన్ జగదీప్ ధన్కర్ మాట్లాడుతూ 'నేను పంచుకోవడానికి ఒక సంతోషకరమైన వార్త ఉంది. ఇది మనందరికీ గర్వకారణం. మార్చి 15-26 వరకు న్యూదిల్లీలో జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మా మహిళా బాక్సర్లు నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు' అని అన్నారు. 'నిఖత్ జరీన్, లోవ్లినా బోర్గోహైన్, నీతూ ఘంఘాస్, సావీటీ బూరాకు మా అభినందనలు. వారి అత్యుత్తమ విజయాలు భారతదేశ భవిష్యత్తును గొప్ప శిఖరాలకు చేర్చుతాయి. యువ ఔత్సాహిక అథ్లెట్లను ఉత్తేజపరుస్తాయి' అని తెలిపారు. వారి విజయాలు పరిపూర్ణమైన కృషి, గొప్ప సంకల్పం, అద్భుతమైన నైపుణ్యాల ప్రదర్శనకు పరాకాష్ఠ అని ధన్కర్ అన్నారు. ఈ మహిళా బాక్సర్లు ఇది 'నారీ శక్తి' పునరుజ్జీవన యుగమని మరోసారి రుజువు చేశారని ఆయన అన్నారు. సభ వారి కోచ్‌లు, జట్టు సిబ్బందిని కూడా అభినందించింది.

## ఉల్లంఘించిన ప్రాథమిక హక్కు ఏమిటి?

### ఎంపీగా ఫైజల్ అనర్హత వ్యాజ్యంపై సుప్రీం

**న్యూదిల్లీ :** హత్యాయత్నం కేసులో కేరళ హైకోర్టు స్టే విధించినప్పటికీ తనపై అనర్హత వేటును తొలగించకపోవడంపై లోక్‌సభ సచివాలయానికి వ్యతిరేకంగా లక్షద్వీప్ మాజీ ఎంపీ, ఎన్‌సీపీ నాయకుడు మహ్మద్ ఫైజల్ దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం సుప్రీం కోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ వ్యాజ్యాన్ని పరిశీలించిన న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, బి.వి.నాగరత్నతో కూడిన ధర్మాసనం... ఇందులో 'ఉల్లంఘించిన ప్రాథమిక హక్కు ఏమిటి?' అని న్యాయవాదిని ప్రశ్నించింది. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే ఎన్సీపీ నాయకుడి హక్కును హరిస్తున్నారని, ఈ చర్య పూర్తిగా ఏకపక్షమని న్యాయవాది తెలిపారు. హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై న్యాయవాది బదులిస్తూ... ఈ అంశాన్ని ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం స్వాధీనం చేసుకుందని అన్నారు. దీంతో బుధవారం విచారణకు ధర్మాసనం అంగీకరించింది. అంతకుముందు, లక్షద్వీప్ మాజీ ఎంపీ తరపు సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ, నిందితుడిని దోషిగా నిర్ధారించి, శిక్షను హైకోర్టు నిలిపివేసినప్పటికీ, ఆ వ్యక్తిని తిరిగి ఎంపీగా చేర్చుకోలేదని వాదించారు. ఒక హత్యాయత్నం కేసులో ఫైజల్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ దిగువ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. దీనిపై ఫైజల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జనవరి 13న లోక్‌సభ సెక్రటేరియట్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, కవరత్తిలోని సెషన్స్ కోర్టు హత్యాయత్నం కేసులో దోషిగా నిర్ధారించబడిన జనవరి 11 నుంచి ఫైజల్ లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడని ప్రకటించింది. న్యాయవాది కె.ఆర్.శశిప్రభు ద్వారా సుప్రీం కోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌లో ఫైజల్, జనవరి 25న తన నేరారోపణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవడంలో లోక్‌సభ సెక్రటేరియట్ విఫలమైందని తెలిపారు.

## సావర్కర్‌పై విమర్శలు తగ్గించండి

### కాంగ్రెస్‌కు పవార్ హితవు

**న్యూదిల్లీ:** వీడీ సావర్కర్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శలు మహారాష్ట్రలో మహారాష్ట్ర వికాస్ అఘాదీ(ఎంవీఏ)లో విభేదాలు సృష్టిస్తున్నాయి. ఈ విభేదాలు తొలగించేందుకు ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ రంగంలోకి దిగారు. సావర్కర్‌పై రాహుల్ విమర్శలను ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన తీవ్రంగా పరిగణిస్తోంది. శివసేన అభ్యంతరాలను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి తెలపడానికి పవార్ శాంతిదూత అవతారమెత్తారు. రాహుల్ వ్యాఖ్యలు మహారాష్ట్రలోని భాగస్వామ్య పార్టీలు ఎన్‌సీపీ, శివసేనకు ఇబ్బందికరంగా పరిణమించడంతో సావర్కర్‌పై విమర్శలను తగ్గించాల్సిందిగా పవార్ సహా కొంతమంది ప్రతిపక్ష నేతలు కాంగ్రెస్‌కు సూచించారు. అందుకు కాంగ్రెస్ అంగీకరించినట్లు పవార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే నాయకత్వంలో సమావేశమైన ప్రతిపక్ష పార్టీల నేతల భేటీలో పవార్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. సావర్కర్ లక్ష్యంగా చేసే విమర్శలు మహారాష్ట్రలో ప్రతికూల పరిస్థితులకు దారితీస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష కూటమికి ఇది ఎంతమాత్రం దోహదం చేయడం లేదని స్పష్టంచేశారు. సమావేశానికి హాజరైన కొంతమంది ప్రతిపక్ష నేతలు సైతం ఇదే అభిప్రాయం వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులతో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కూడా సమావేశంలో ఉన్నారు. సావర్కర్ అసలు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడే కాదని రాహుల్‌కు పవార్ వివరించారు. ప్రతిపక్ష పార్టీల అసలు సిసలు యుద్ధం ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీపైనేనని స్పష్టంచేశారు. బ్రిటన్ పర్యటన సందర్భంగా భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపిన రాహుల్ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తుండగా తాను సావర్కర్‌ను కాదని, క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని రాహుల్ స్పష్టంచేశారు. సావర్కర్‌పై రాహుల్ విమర్శలను ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్య సమరయోధుడిని అవమానిస్తే సహించేది లేదని ఉద్ధవ్ గట్టిగా చెప్పారు.

## అపహరణ కేసులో అతిక్ అహ్మద్‌కు జీవిత ఖైదు

**లక్నో :** ఉమేశ్ పాల్ అపహరణ కేసులో మాజీ ఎంపీ, గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌తో పాటు మరో ఇద్దరిని ఉత్తర ప్రదేశ్ ప్రయోగ్‌రాజ్ కోర్టు దోషులుగా తేల్చింది. ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అహ్మద్ సోదరుడు ఖలీద్ అజీమ్ అలియాస్ అష్రఫ్ సహా ఏడుగురిని నిర్దోషులుగా విడుదల చేసింది. అంతకుముందు, నైనీ కేంద్ర కారాగారం నుంచి భారీ భద్రత మధ్య నిందితులను కోర్టుకు తీసుకువచ్చారు. 2005లో జరిగిన బీఎస్‌పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో అతీక్ అహ్మద్ ప్రధాన నిందితుడు. 2019 నుంచి సబర్మతి జైలులో ఉన్నాడు. అయితే రాజు పాల్ హత్య కేసులో ముఖ్య సాక్షిగా ఉన్న ఉమేశ్ పాల్ 2006లో అపహరణకు గురై విడుదలయ్యాడు. 2007లో అతను అతీక్‌తో పాటు అనేక మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేశాడు. ఈ కేసు విచారణ చివరి రోజు అయిన ఫిబ్రవరి 24, 2023నే అతను హత్యకు గురయ్యాడు. అయితే, ఉమేశ్‌ను హత్య చేసినట్లు భావిస్తోన్న ఒక వ్యక్తి మార్చి 14న జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ కేసులో అతీక్ అహ్మద్ పైనా కేసు నమోదయింది. ఈ క్రమంలోనే తాజాగా 2006 నాటి అపహరణ కేసులో కోర్టు అతీక్ అహ్మద్‌తో పాటు సౌలత్ హనీఫ్, దినేశ్ పాసీని దోషులుగా తేల్చింది.

**రక్షణ కల్పించాలన్న వ్యాజ్యాన్ని తోసిపుచ్చిన సుప్రీం**

**న్యూదిల్లీ :** ఉత్తర ప్రదేశ్‌లో తన ప్రాణానికి ముప్పు ఉందని ఆరోపించిన తర్వాత రక్షణ కోరుతూ గ్యాంగ్‌స్టర్... ఆ తర్వాత రాజకీయ నాయకుడిగా మారిన అతిఖ్ అహ్మద్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. గుజరాత్ నుంచి ప్రయోగ్‌రాజ్‌కు తరలించిన అహ్మద్, తన న్యాయవాది ద్వారా ఉత్తర ప్రదేశ్ లో తన ప్రాణానికి ముప్పు ఉందని న్యాయస్థానానికి విన్నవించాడు. తనకు రక్షణ కల్పించాలని కోరాడు. ఉమేశ్ పాల్ అపహరణ, హత్యకు సంబంధించిన కేసులో మార్చి 28న ప్రయోగ్‌రాజ్‌లో ఒక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు అతనిని దోషిగా నిర్ధారించింది. జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించింది. అహ్మద్ పోలీసుల కస్టడీలో ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం అతనికి రక్షణ కల్పిస్తుందని అహ్మద్ తరపు న్యాయవాదికి తెలిపింది. అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. 2005లో బీఎస్పీ ఎమ్మెల్యే రాజుపాల్ హత్య కేసులో సాక్షి ఉమేశ్ పాల్ 2005లో అపహరణకు గురయ్యాడు. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రయాగ్‌రాజ్‌లోని తన నివాసం వెలుపల ఉమేశ్ పాల్ కాల్చివేయబడిన తర్వాత ఈ కేసు దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి మోహిత్ జైస్వాల్‌ని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో యూపీలోని ఫుల్‌పూర్ మాజీ ఎంపీని గుజరాత్‌లోని హైసెక్యూరిటీ జైలుకు తరలించాలని ఆ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు ఆదేశించింది.

# కౌలు రైతులకూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి

**ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కౌలు రైతులకూ వర్తింపజేయాలని, వారు సాగుచేస్తున్న ప్రతి ఎకరానికి పెట్టుబడిసాయంగా రూ.10 వేలు అందించాలని అఖిలభారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కౌలు రైతుల చట్టాన్ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులివ్వాలని, ఆ కార్డులు పొందిన కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద సున్నా వడ్డీకే పంట రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో మంగళవారం నిర్వహించిన కౌలు రైతుల రాష్ట్ర సదస్సుకు సంఘం నాయకులు ఎ.కాటమయ్య, కె.తిమ్మయ్య, దొంతా కృష్ణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. రావుల వెంకయ్య ప్రసంగిస్తూ కౌలు రైతులు దేశంలో గణనీయ సంఖ్యలో ఉన్నారన్నారు. వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు కౌలురైతులకు అందడం లేదని చెప్పారు. 26 లక్షల మంది కౌలు రైతులుంటే కేవలం ఐదోవంతు మందికి మాత్రమే గుర్తింపు కార్డులిచ్చి చేతులు దులుపుకుంటున్నారని రావుల వెంకయ్య విమర్శించారు. కార్డులు లేకపోతే ఈ-క్రాప్ నమోదు చేయడం లేదని, ఉచిత పంటల బీమాలోనూ కౌలు రైతుల పేర్లు నమోదవ్వలేదని, డబుల్ ఫైనాన్స్ పేరుతో సున్నా వడ్డీ పంటరుణాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అరుగాలం పండించిన పంటల విక్రయానికిగాను కొనుగోలు కేంద్రాలకు వెళ్తే ఈ-క్రాప్ నమోదు కాలేదని తిరస్కరిస్తున్నారని చెప్పారు.

**కౌలురైతుల సంక్షేమానికి రూ.10వేల కోట్లు కేటాయించాలి: రామకృష్ణ**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కౌలురైతుల రక్షణ, సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం-2019ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయాలని, దేవాదాయ, ధర్మాదాయశాఖ భూములు సాగుచేసే కౌలు రైతులందరికీ వ్యవసాయ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ సొంత భూమి లేని కౌలురైతులందరికీ జీవో-96ను సవరించి రైతుభరోసా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల స్వీయ ధృవీకరణతో రైతుభరోసా కేంద్రాల అధికారులు నిర్ధారించుకుని ఈ-క్రాప్ నమోదు చేసి ఉచిత పంటల బీమా, నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, పంటలు అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విపత్తులు, చీడపీడల వలన నష్టపోయిన కౌలురైతులకు పెట్టుబడి రాయితీ, పంటల బీమా పరిహారం దక్కడం లేదన్నారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు రాక పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని, కౌలు రైతుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియో రూ.7 లక్షలు పొందాలంటే గుర్తింపు కార్డులు కావాలన్నారు. వాటితో పాటు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలు తదితర ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలు కౌలు రైతులకు రావడం లేదని, కౌలు రైతుల సంక్షేమం-రక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ సీసీఆర్సీ పొందిన కౌలు రైతులకు భూ యజమాని తీసుకునే పంటరుణంతో సంబంధం లేకుండానే 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు-425ను రద్దు చేసి...భూమిలేని పేదలుగా గుర్తించబడిన పేద సాగుదార్లకు బహిరంగ వేలం నిర్వహించకుండా నామమాత్రపు లీజుతో కొనసాగించాలన్నారు. రైతుసంఘం నాయకులు దేగా ప్రభాకర్, వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య

జమలయ్య

**నూతన కార్యవర్గం ఎన్నిక**

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర కమిటీ 15 మందితో ఏర్పడింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ కేశవశెట్టి, అధ్యక్షుడిగా ఎ.కాటమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.జమలయ్య, ఉపాధ్యక్షులుగా కె.తిమ్మయ్య, దొంతా కృష్ణ, కార్యదర్శిగా పి.కోటేశ్వరరావు, కోశాధికారిగా కంజుల విఠల్‌రెడ్డిని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

# పోలవరంపై నీలినీడలు

- చేతులెత్తేసిన కేంద్రం: చోద్యం చూస్తున్న జగన్ ప్రభుత్వం
- 45.72 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టు నిర్మించాలి
- విశాఖ గోష్ఠిలో అఖిలపక్ష నేతల డిమాండ్

**విశాలాంధ్ర-విశాఖ:** ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి జాతికి అంకితం చేయాల్సి ఉండగా పాలకుల కుటిల రాజకీయం కారణంగా ముందుకు కదలడం లేదని, పోలవరం ప్రాజెక్టు భవిత వ్యంపై నీలినీడలు అలుముకున్నాయని అఖిలపక్ష నాయకులు విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించకుండా నిర్మాణం చేపట్టాలని సీపీఐ అధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన అఖిలపక్ష రాజకీయ పార్టీల చర్చా గోష్ఠిలో సీపీఐ, టీడీపీ, జనసేన, సీపీఎం, ఎల్ఎస్‌పీ, కాంగ్రెస్, ఆప్ నేతలు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ దేశంలో వృథా అవుతున్న వేలాది టీఎంసీల నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు అందించి భూములను సస్య శ్యామలం చేద్దామన్న కనీస ఆలోచన ప్రభుత్వాలకు లేదన్నారు. కొన్ని ప్రాజెక్టులు పునాది రాళ్లకే పరిమితమ య్యాయని, పూర్తయిన ప్రాజెక్టులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. ఎత్తు తగ్గించడం వల్ల ముంపు ప్రభావిత ప్రాంతం కూడా తగ్గుతుందని, తద్వారా భూసేకరణ చేపట్టాల్సిన ప్రాంతం గణనీయంగా తగ్గి పరిహారం, పునరావాసం ప్యాకేజీ భారం తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు వైసీపీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పార్లమెంట్‌లో పోలవరం ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఇచ్చిన సమాధానంతో స్పష్టమవుతోందన్నారు. కేంద్రం చేతులెత్తేసినా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శిం చారు. దీనివల్ల ప్రాజెక్టు అనుకున్న లక్ష్యం నెరవేరే పరిస్థితి ఉండదన్నారు. డ్యాం ఎత్తు తగ్గిస్తే నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గి పోతుందని చెప్పారు. ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టుగా కాకుండా బ్యారేజీగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసుల ఆశలు అడియాశలవుతాయన్నారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండదని, ఉత్తరాంధ్రకు తాగునీరు అందే పరిస్థితి ఉండదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టును 196.60 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సి ఉందన్నారు.

పోలవరం ముంపు ముప్పు ఎదుర్కొంటున్న మండలాల ప్రజల బాధలు వర్ణనాతీతమని నాయకులు చెప్పారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలు, వరదలు ఆ ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయన్నారు. ముంపు గ్రామాల ప్రజల్లో ఆత్మస్థైర్యం పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ఎటపాకలోని 120 గ్రామాలకుగాను 57 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం మండలంలో చాలా గ్రామాలు, వీఆర్ పురం మండలంలోని 72 గ్రామాలకుగాను 56 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయని వివరించారు. కాఫర్ డ్యామ్ నిర్మాణం కారణంగా పదుల రోజుల పాటు వందల గ్రామాలు నడుం లోతు నీటిలో కూరుకుపోయాయని చెప్పారు. నిర్వాసితులకు రూ.10. లక్షల ప్యాకేజీ ఇస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం... ఆ మేరకు 2021 జూన్ 30న జీవో విడుదల చేసి చేతులు దులుపుకుం దన్నారు. కేంద్రం నుంచి రూ.2,900 కోట్ల నిధులు రావాల్సి ఉందని, వచ్చాక అందిస్తామని నమ్మబలి కిందని విమర్శించారు. పోలవరం బాధితులకు పరిహారం పెంపుపై ఎటువంటి హామీ ఇవ్వలే దని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అసెంబ్లీ లోనే రాతపూర్వక జవాబివ్వడం నిర్వాసితుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందన్నారు. చర్చాగోష్ఠిలో నాయకులు అనేక డిమాండ్లు చేశారు.

పోలవరం ఎత్తుపై కేంద్రం మొండి వైఖరి విడనా డాలని, ప్రాజెక్టు ఎత్తు కుదించకుండా డ్యామ్‌ను 45.75 మీటర్ల ఎత్తుతో, 196.60 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతోనే నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ఎనిమిది మండలాల్లో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించాలని, 1986, 2022లో సంభవించిన భారీ వరదలను ప్రామాణికంగా తీసుకొని రీ సర్వే చేసి ముంపు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ అందజేయాలని, 2022 నాటి వరదల్లో మునిగిన పునరావాస కాలనీలకు ప్రత్యామ్నాయంగా ముంపులేని చోట పునరావాసం ఏర్పాటు చేయాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 25 మౌలిక సదుపాయాలతో పునరావాస కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ముంపు ఏరియాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల చొప్పున ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, భూమికి భూమి ఇచ్చే ప్రాంతం సారవంతమైనది... వివాదరహితమైనదిగా ఉండాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లోని యువతీ యువకులకు నైపుణ్యా భివృద్ధి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం ఇవ్వాలని, 2022లో సంభవించిన వరదలకు పూర్తిగా నష్టపోయిన ఇళ్లకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చర్చాగోష్ఠిలో ఆచార్య కేఎస్ చలం, జనసేన రాష్ట్ర పీఏసీ సభ్యుడు కోన తాతారావు, మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.గోవిందరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఆప్ నాయకులు కె.లోకనాథం, సీపీఐ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, కార్యవర్గసభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, జి.రాం బాబు, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, సీఎన్ క్షేత్రపాల్, రాజాన దొరబాబు, బి.సుబ్బలక్ష్మి, ఆర్.అప్పలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.సుధాకర్, ఆప్ సీనియర్ నాయకుడు ఎంఎస్ఎన్ మూర్తి, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మోదానీ'పై రాజీలేని పోరాటం

- రాహుల్ అనర్హతపై జాతీయోద్యమం
- ఏప్రిల్‌లో జై భారత్ మహా సత్యాగ్రహం
- నెలరోజుల కార్యాచరణ సిద్ధం: కాంగ్రెస్ ప్రకటన

**న్యూఢిల్లీ:** 'మోదానీ' (మోదీ, అదానీ)పై రాజీలేని పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. తమ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో తమ నిరసనను తెలిపేందుకు తోడు అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ కోసం ఒత్తిడి పెంచేందుకు నెలరోజులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగానే మంగళ-బుధవారాల్లో ఎర్రకోట నుంచి 'లోక్‌తంత్ర బచావో మషాల్ శాంతి మార్చ్', దేశంలోని 35 ప్రధాన నగరాల్లో విలేకరుల సమావేశాలు చేపట్టింది. ఇక ఏప్రిల్ రెండవ వారంలో 'జైభారత్ మహా సత్యాగ్రహం'ను మండలం నుంచి జాతీయ స్థాయి వరకు పెద్దఎత్తున చేపట్టబోతోంది. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల రోజులు జరగబోయే ఆందోళనల కార్యచరణను వెల్లడించారు. రాహుల్ గాంధీకి సంఘీభావం ప్రకటించారు. ప్రజా లూటీ, జాతీయ సంపదను మోదీ-అదానీ స్వాహా చేయడానికి వ్యతిరేక రాజీలేని పోరాటానికి మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద 'సంకల్ప్ సత్యాగ్రహాన్ని' నిర్వహించిందని, అన్ని రాష్ట్రాలు, జిల్లా కేంద్రకార్యాలయాల్లోని గాంధీ విగ్రహాల వద్ద 26న ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు లేక ఎమ్మెల్సీలు తమ పరిధిలోని సభల్లో నల్ల వస్త్రధారణలో నిరసన వ్యక్తంచేశారని, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేపట్టారని చెప్పారు. ఈనెల 24న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, ఫ్రంటల్ వ్యవస్థలు, శాఖల హెడ్‌లు పాల్గొన్నారు.

**స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ కసరత్తు**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై వివక్షతో హడావిడిగా అనర్హత వేటు వేసినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇదే విషయంలో అన్ని విపక్ష పార్టీలతో చర్చలు జరుపుతోంది. మంగళవారం ఉదయం జరిగిన విపక్షాల సమావేశంలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం అంశం చర్చకు వచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సోమవారం లోక్‌సభలో దీనిని ప్రవేశపెట్టాలని భావిస్తుండగా కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్న క్రమంలో ప్రతిపక్ష ఐక్యత దెబ్బతినవచ్చన్న మాట వినిపిస్తోంది. ప్రధాని ఇంటి పేరుపై విమర్శలతో నమోదైన పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు శిక్ష విధించిన కొన్ని గంటలలోనే రాహుల్‌పై అనర్హత వేటు పడింది. ఎంపీగా ఆయనపై వేటు విధించిన వేగానికి ఈ తీర్మానం ప్రాధాన్యమిస్తుంది. సభ సజావుగా జరిగితే తప్ప అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే వీలు ఉండదు. కనీసం 50మంది ఎంపీలు ఆమోదిస్తేగానీ దీనిని ప్రవేశపెట్టలేమని పార్టీల వర్గాలు తెలిపాయి. సభ సజావుగా జరగని నెపంతో దానికి అనుమతివ్వకపోవచ్చని పేర్కొన్నాయి.

## డిప్యూటీ సీఎం ఇంట్లో బాంబు!

**నాగపూర్:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇంటిలో బాంబు ఉన్నట్లు ఓ వ్యక్తి అర్ధరాత్రి వేళ ఫోన్ చేసి పోలీసులను హడలెత్తించాడు. వారు హుటాహుటిన ఫడ్నవీస్ ఇంటికి చేరుకొని అక్కడ అణువణువు గాలించగా ఏమీ లభించలేదు. ఇదంతా ఓ ఆకతాయి పనిగా పోలీసులు గుర్తించారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకున్నారు. తన ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిర్రెత్తిన ఆ వ్యక్తి... పోలీసులకు నకిలీ ఫోన్ చేసినట్లు పోలీసు కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపారు. కన్హన్ పట్టణానికి చెందిన 30ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. 'అర్ధరాత్రి 2 గంటలకు నాగపూర్ పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ గుర్తుతెలియని ఫోన్ వచ్చింది. ఫడ్నవీస్ ఇంటి బయట బాంబు ఉన్నట్లు ఫోన్‌లో ఒకడు చెప్పాడు. సంభాషణ మధ్యలోనే ఫోన్ పెట్టేశాడు. వెంటనే బాంబు స్క్వాడ్, పోలీసులు, జాగిలాల బృందం ధర్మపేట్‌లోని త్రికోణి పార్కు వద్దనున్న డిప్యూటీ సీఎం ఇంటికి చేరుకొని తనిఖీలు నిర్వహించగా ఎలాంటి పేలుడు సామాగ్రి లభించలేదు' అని తెలిపారు. ఫడ్నవీస్, ఆయన కుటుంబం ముంబైలో ఉన్నట్లు సీనియర్ అధికారి చెప్పారు.

పాన్-ఆధార్ అనుసంధానం

## జూన్ 30వరకు గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం పాన్‌కార్డ్-ఆధార్ కార్డు అనుసంధానానికి గడువు పొడిగించింది. ఇందుకోసం మార్చి 31 తుది గడువుగా గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా దాన్ని జూన్ 30, 2023 వరకు అంటే మరో మూడు నెలలు పొడిగించారు. ఇప్పటికే చాలాసార్లు కేంద్రం ఈ గడువును పొడిగిస్తూ వచ్చింది. అయితే ఈ సారి గడువు ఉండదని ప్రకటించినప్పటికీ మరోసారి గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పన్ను చెల్లింపుదారులకు మరింత సమయం ఇచ్చే ఉద్దేశంతో గడువు పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలియజేసింది. నిర్దేశిత గడువులోగా పాన్- ఆధార్ అనుసంధానం పూర్తి చేయకుంటే జులై 1 నుంచి పాన్ నిరుపయోగంగా మారనుంది. పాన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తీ ఆదాయపు పన్ను చట్టం-1961 ప్రకారం ఆధార్‌తో అనుసంధానం చేయాలి. ఇప్పటికే దీనికి సంబంధించిన గడువు ముగిసింది. రూ.1000 అపరాధ రుసుముతో మార్చి 31లోపు అనుసంధానానికి చివరి అవకాశం ఇచ్చింది. తాజాగా ఆ గడువును మరో మూడు నెలలు పొడిగించింది. చెల్లుబాటులో లేని పాన్‌తో బ్యాంకు ఖాతా, డీమ్యాట్ ఖాతాల్లాంటివి తెరవలేరు. మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకూ నిబంధనలు అడ్డువస్తాయి. ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారు. ఇప్పటికే 51 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని సీబీడీటీ పేర్కొంది.

బంగ్లాను ఖాళీ చేయాలన్న

## మీ నోటీసుకు కట్టుబడి ఉంటా

**లోక్‌సభ సచివాలయానికి తెలిపిన రాహుల్**

**న్యూఢిల్లీ:** తన అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలని లోక్‌సభ సచివాలయం నోటీసుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం సమాధానం ఇచ్చారు. తనను అవమానపరిచారని ఆరోపిస్తూ తమ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని నిందించినప్పటికీ, తొలగింపు నోటీసుకు కట్టుబడి ఉంటానని చెప్పారు. గత వారం క్రిమినల్ పరువు నష్టం కేసులో దోషిగా తేలిన తర్వాత లోక్‌సభ సభ్యునిగా అనర్హత వేటు పడిన నేపథ్యంలో ఏప్రిల్ 22లోగా తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని గాంధీకి సోమవారం నోటీసు అందింది. లోక్‌సభ సచివాలయానికి పంపిన సమాధానంలో రాహుల్ ఇలా పేర్కొన్నారు. '12 తుగ్లక్ లేన్‌లోని నా వసతిని రద్దు చేసినందుకు సంబంధించి మార్చి 27, 2023 నాటి మీ లేఖకు ధన్యవాదాలు. గత నాలుగు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన సభ్యుడిగా, ఇది నేను ఇక్కడ గడిపిన సంతోషకరమైన జ్ఞాపకాలకు నేను ప్రజల ఆదేశంతో రుణపడి ఉన్నాను. నా హక్కులకు భంగం కలగకుండా, నేను మీ లేఖలో ఉన్న వివరాలకు కట్టుబడి ఉంటాను' అని ఆయన తనకు నోటీసు పంపిన లోక్‌సభ సచివాలయం ఎంఎస్ శాఖకు తన లేఖలో తెలిపారు. 2005 నుంచి 12, తుగ్లక్ లేన్ బంగ్లాలో నివసిస్తున్న జడ్-ప్లస్ భద్రత కలిగిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడికి సభా సచివాలయం నోటీసును అందజేసిన నేపథ్యంలో లోక్‌సభ హౌసింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది.

**కేంద్రంపై మండిపడిన ఖర్గే**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం రాహుల్ గాంధీని తన అధికారిక బంగ్లాను ఖాళీ చేయమని కోరడంపై కేంద్రాన్ని నిందించారు. తమ పార్టీ మాజీ అధ్యక్షుడిని 'బెదిరించడం, భయపెట్టడం, అవమానపరిచే' ప్రభుత్వ వైఖరిని తాను ఖండిస్తున్నానని అన్నారు. రాహుల్ గాంధీ తన తల్లి సోనియా గాంధీతో కలిసి ఆమె 10 జన్‌పథ్ నివాసానికి వెళ్లి నివసించవచ్చు లేదా గాంధీ వారసుడు కోసం ఒక ఇంటిని ఖాళీ చేయడం ద్వారా తానే స్వయంగా ఇంటిని అందించవచ్చని కూడా ఆయన చెప్పారు. 'అతన్ని (రాహుల్ గాంధీ) బలహీనపరచడానికి వారు అన్నీ చేస్తారు. అతను తన తల్లితో నివసించవచ్చు లేదా అతను నా దగ్గరకు రావచ్చు, నేను అతని కోసం ఒకదాన్ని ఖాళీ చేస్తాను. బెదిరించడం, భయపెట్టడం, అవమానించడం వంటి ప్రభుత్వ వైఖరిని నేను ఖండిస్తున్నాను' అని పార్లమెంటుకు బయలుదేరే ముందు విలేకరులతో అన్నారు. 'ప్రజాస్వామ్యంలో మేము మూడు-నాలుగు నెలలు ఇల్లు లేకుండా చాలాసార్లు గడిపాము. ఆరు నెలల తర్వాత నేను ఈ బంగ్లాను పొందాను. ప్రజలు ఇతరులను కించపరచడానికి ఈ పనులు చేస్తారు. ఈ వైఖరిని నేను ఖండిస్తున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కూడా ఈ చర్యపై ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇది 'చిల్లర మనుషుల చిల్లర రాజకీయాలు' అని అన్నారు. 'రాహుల్ బంగ్లాను ఖాళీ చేయమని అడిగారు. వారి మనస్సాక్షి విహారయాత్రకు వెళ్లింది. చిల్లర రాజకీయాలు' అని సిబల్ ట్వీట్ చేశారు. ఇదిలాఉండగా, ఒక విలేకరుల సమావేశంలో రాహుల్‌కు నోటీసుపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ప్రశ్నించగా, ఆస్తి అతనిది కాదని, ప్రజలదని అన్నారు.

## పట్టణీకరణకే ప్రాధాన్యం

**జీ20 వర్కింగ్ గ్రూప్ తొలిరోజు సమావేశంలో చర్చ**

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** రాబోయే రోజుల్లో పట్టణీకరణ పైనే అధిక ప్రాధాన్యం చూపాలని జీ20 వర్కింగ్ గ్రూప్ సమావేశం అభిప్రాయపడింది. నగరాలను ఆర్థిక వృద్ధికి కేంద్రాలుగా మార్చడం, పట్టణ మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం చేయడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పట్టణ మౌలిక సదుపాయాలను నిర్మించడంతో పాటు ఇతర ముఖ్యమైన అంశాలను చర్చించింది. భారతదేశం ఆతిథ్యం ఇస్తున్న జీ20 దేశాల రెండవ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యూజీ) సమావేశం మొదటి రోజు మంగళవారం విశాఖపట్నంలో ముగిసింది. 14 సభ్య దేశాలు, 8 అతిథి దేశాలు, 10 అంతర్జాతీయ సంస్థల నుంచి 57 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మౌలిక సదుపాయాల అజెండాలో వివరించిన ఇతర ప్రాధాన్యతలతో పాటు 'రేపటి ఆర్థిక నగరాలు' ఇన్‌క్లూజివ్, రెసిలెంట్, సస్టైనబుల్' పై చర్చలు జరిగాయి. భవిష్యత్ నగరాల రూపకల్పనకు మౌలిక సదుపాయాల ఆర్థిక అంతరాన్ని పరిష్కరించడానికి, ప్రైవేట్ రంగ పెట్టుబడిని పెంచడానికి, ఆర్థిక రంగ నమూనాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అంతటా నాణ్యత, మౌలిక సదుపాయాల పెట్టుబడి సూచికల సంభావ్యత గురించి చర్చించడంపై దృష్టి సారించాయి. మరోవైపు, మౌలిక సదుపాయాల వర్గీకరణల గురించి చర్చించడానికి అంతర్జాతీయ సంస్థల రౌండ్ టేబుల్ సమావేశాన్ని కూడా పూర్తి చేసింది. యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, ఏడీబీ, ఈబీఆర్‌డీ వంటి కీలక అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ జియోగ్రఫీ మెక్సికో, ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్, బ్రిటన్ దేశ ప్రతినిధులు జాతీయ మౌలిక సదుపాయాల వ్యయాన్ని మెరుగుపరచడంపై అధ్యయనాన్ని సమర్పించారు. సాయంత్రం, ప్రతినిధులకు 'రాత్రి భోజ్ పర్ సంవాద్' (విందుపై సంభాషణ) ఆంధ్రప్రదేశ్ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, స్థానిక వంటకాలను ఆస్వాదించేందుకు ఆతిథ్యం ఇచ్చారు. కాగా రెండవ రోజు ప్రెసిడెన్సీ బీచ్ ఫ్రంట్‌లో ప్రతినిధులకు యోగా, ధ్యానం, సాత్విక ఆహారాన్ని పరిచయం చేస్తారు. ఆ తర్వాత ఐడబ్ల్యూజీ మిగిలిన అజెండాను చర్చిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## గోదుమ ఎగుమతులపై నిషేధం కొనసాగింపు

**న్యూఢిల్లీ:** దేశీయంగా సరిపడ వనరులు సమకూరేంత వరకు గోదుమ ఎగుమతిపై నిషేధం కొనసాగుతుందని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) చీఫ్ అశోక్ కె. మీనా మంగళవారం తెలిపారు. తాజాగా కురిసిన వర్షాల వల్ల గోదుమ సాగుపై ప్రభావం ఉండదని, నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటామని దీమాగా చెప్పారు. దేశంలో గోదుమ సేకరణ మొదలైందని, ఇప్పటివరకు 10,727 టన్నులను మధ్యప్రదేశ్ నుంచి సేకరించినట్లు మీనా వెల్లడించారు.

**నష్టమెంతో ఇప్పుడే చెప్పలేం...: తోమర్**

అధిక ఉష్ణోగ్రతల వల్ల గోదుమ పంటకు జరిగిన నష్టమెంతో ఇప్పుడే చెప్పలేమని కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం లోక్‌సభకు రాతపూర్వకంగా తెలిపారు. 'ఉత్తరంలోని చాలా ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలలో 32-33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నీరుపారుదల వల్ల 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కాబట్టి పంటకు నష్టమేమీ ఉండదు' అని తోమర్ వెల్లడించారు. 'మార్చి 16-22 తేదీల్లో కొన్ని చోట్ల చెదురుమదురు వర్షాలు కురవగా మరికొన్ని చోట్ల మోస్తరు వర్షపాతం నమోదైంది. దీంతో పంజాబ్, హరియాణా, దిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలకు బదులు సాధారణం లేక సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రతల వల్ల గోదుమ పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడం తొందరపాటే అవుతుంది' అని తోమర్ తెలిపారు. గోదుమలు రబీలో ప్రధానంగా పండించే పంట. దేశంలోని అనేక భాగాల్లో గోదుమసాగు మొదలైంది. 112.2 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 2022-23 పంట వత్సరం (జులై-జూన్)లో ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే గోదుమలు, గోదుమ పిండి ధరలను నిషేధించేందుకు గతేడాది మేనెల నుంచి గోదుమ ఎగుమతులపై నిషేధం కొనసాగుతున్న విషయం విదితమే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.